శుక్రవారం
01-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 72
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

జొహానెస్‌బర్గ్‌లో అగ్ని ప్రమాదం

73 మంది సజీవదహనం

దక్షిణాఫ్రికా, జొహానెస్‌బర్గ్‌లో బహుళ అంతస్తు భవనంలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 73 మంది సజీవ దహనం కాగా మరో 52 మంది గాయపడ్డారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని జొహానెస్‌బర్గ్ అధికార ప్రతినిధి రాబర్ట్ ములౌడ్జి వెల్లడించారు.

2లో

అదానీ మరో మోసం

- వెలుగులోకి 'స్టాక్' అవినీతి
- చేతులు మారిన వందల మిలియన్ డాలర్లు
- మారిషస్ వేదికగా డొల్ల కంపెనీలతో రహస్య పెట్టుబడులు
- బాంబు పేల్చిన ఓసీసీఆర్పీ

న్యూఢిల్లీ: అదానీ సంస్థ మరో మోసం బయటపడింది. స్టాక్ మార్కెట్‌లో అక్రమాలు వెలుగుచూశాయి. ఇప్పటికే హిండెన్‌బర్గ్ చిక్కుల్లో ఉన్న పారిశ్రామికవేత్త గౌతం అదానీ మెడకు ఓసీసీఆర్పీ ఉచ్చు చుట్టుకుంది. స్టాక్ మార్కెట్ కార్యకలాపాల్లో అవకతవకలు, డొల్ల కంపెనీల ద్వారా పెట్టుబడులు వంటి ఆరోపణలను ది ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్పీ) చేసింది. హిండెన్‌బర్గ్ నివేదిక తరహాలోనే అదానీ సంస్థ అవినీతి చిట్టా విప్పింది. 2013-18 వరకు అదానీ గ్రూపు షేర్లు భారీగా పెరిగాయి. దీని వెనుక రహస్య పెట్టుబడులు ఉన్నాయి. మారిషస్‌లో కొన్ని వందల మిలియన్ డాలర్ల పెట్టుబడులను రహస్యంగా కుటుంబ సభ్యుల ద్వారా పెట్టించినట్లు ఓసీసీఆర్పీ పేర్కొంది. ఇద్దరు విదేశీ పెట్టుబడిదారుల ద్వారా అదానీ గ్రూప్ కంపెనీల్లో ఇన్‌సైడర్ ట్రేడింగ్ జరిగిందని పేర్కొంది. పారదర్శకత లేని మారిషస్ నిధుల ద్వారా అదానీ గ్రూప్ బహిరంగంగా ట్రేడవుతున్న స్టాక్స్‌లోకి పెట్టుబడులు తీసుకొస్తోందని వెల్లడించింది. అదానీ కుటుంబ సభ్యుల, వ్యాపార భాగస్వాముల ప్రమేయం ఇందులో ఉందని పేర్కొంది. వినోద్ అదానీ (గౌతం అదానీ అన్న)కి సన్నిహితులైన ఇద్దరికి చెందిన మారిషస్ కంపెనీల ద్వారా అవినీతి దందా నడిచినట్లు తెలిపింది. యూఏఈకి చెందిన నాసర్ అలీ షాబాన్ అహ్లి, తైవాన్‌కు చెందిన చాంగ్ చుంగ్-లింగ్ అధ్వర్యంలో వినోద్ అదానీ సన్నిహితుడికి చెందిన దుబాయి కంపెనీ పర్యవేక్షణలో అక్రమ ట్రేడింగ్ జరిగిందని ఓసీసీఆర్పీ ఆరోపించింది. అయితే అనుమానాస్పదంగా ఉన్న అదానీ గ్రూపు స్టాక్ మార్కెట్ కార్యకలాపాల గురించి 2014లోనే సెబీకి ఆధారాలు అందజేసినట్లు వెల్లడిస్తూ, ఓ లేఖనూ ప్రస్తావించింది. 2014లో సెబీకి నాయకత్వం వహించిన యూకే సిన్హా ప్రస్తుతం అదానీకి చెందిన ఎన్డీటీవీ డైరెక్టర్, చైర్‌పర్సన్‌గా ఉండటం గమనార్హం.

రీసైకిల్డ్ ఆరోపణలు : అదానీ గ్రూపు

ఓసీసీఆర్పీ ఆరోపణలను అదానీ గ్రూపు పూర్తిగా కొట్టిపారేసింది. ఇవి రీసైకిల్డ్ ఆరోపణలని పేర్కొంది. ఇదంతా జార్జ్ సొరోస్ నిధులతో నడుస్తున్న విదేశీ మీడియాలోని ఓ విభాగం చేస్తున్నట్లు ఆరోపించింది. హిండెన్‌బర్గ్ నివేదికను పునరుద్ఘాటించడమే వీటి ఉద్దేశమని వ్యాఖ్యానించింది. ఓ దశాబ్దం కిందట మూతపడిన కేసుల ఆధారంగా ఈ ఆరోపణలు చేసినట్లు సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఓవర్-ఇన్‌వాయిసింగ్, విదేశాల్లో నిధుల బదిలీ, రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్స్, ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్స్ ద్వారా పెట్టుబడులపై వచ్చిన ఆరోపణల మీద పదేళ్ల క్రితమే డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) దర్యాప్తు చేసినట్లు అదానీ గ్రూపు వెల్లడించింది. లావాదేవీలన్నీ చట్టాలకు అనుగుణంగానే జరిగాయని తెలిపింది. ఓవర్-వాల్యుయేషన్ జరగలేదని చెప్పింది. స్వతంత్ర యాడ్జుడికేటింగ్ అథారిటీ, అపిలేట్ ట్రిబ్యునల్ కూడా దీనిని ధ్రువీకరించినట్లు తెలిపింది. ఓవర్-వాల్యుయేషన్ లేనందువల్ల నిధుల బదిలీపై ఆరోపణలన్నీ నిరాధారమైనవేనని అదానీ గ్రూపు వెల్లడించింది.

జేపీసీతోనే నిజనిర్ధారణ

అదానీ గ్రూపుపై ఓసీసీఆర్పీ నివేదికలో నిజం ఎంతన్నది తేలాలంటే సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విచారణ జరగాల్సిందేనని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు నొక్కిచెప్పాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం విలేకరులతో మాట్లాడుతూ అదానీ సంస్థలో బినామీ పెట్టుబడుల బాగోతం

- మిగతా 2 లో

దేశ ఐక్యతే లక్ష్యం

- రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం
- బీజేపీని గద్దె దించడానికి ఉమ్మడి పోరు
- ముంబై భేటీలో 'ఇండియా' నేతల స్పష్టీకరణ
- నేడు కీలక నిర్ణయాలు

ముంబై: రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం, కేంద్రంలో బీజేపీని గద్దె దించడమే తమ ఏకైక లక్ష్యమని ప్రతిపక్షాల 'ఇండియా' కూటమి నేతలు ఉద్ఘాటించారు. పేదరికం, నిరుద్యోగం, ప్రజలు, రైతుల సంక్షేమానికి సంబంధించిన సమస్యల పరిష్కారంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఇండియా కూటమికి లభిస్తున్న ఆదరణతో బీజేపీ, ప్రధానమంత్రి వెన్నులో వణుకు పుడుతోందని చెప్పారు. దేశ ఐక్యతకు తమ కూటమి పనిచేస్తోందని, ఇది కూటమి మాత్రమే కాదు...అన్ని పార్టీల నేతల ఆలోచనలకు నిలయమని పునరుద్ఘాటించారు. దేశ సమాఖ్య వ్యవస్థ ప్రమాదంలో ఉందని, బీజేపీకి పట్టంకట్టని రాష్ట్రాలకు వేధింపులు తప్పడం లేదని విమర్శించారు. సీట్లు పెంచుకోవడం మాత్రమే కాదు... దేశాన్ని కాపాడుకోవడం కూడా కూటమి లక్ష్యమని నాయకులు నొక్కిచెప్పారు. దేశాన్ని పునర్నిర్మిస్తూ పాలకపక్షానికి అద్దం పట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహం, సీట్ల సర్దుబాటు, ఉమ్మడి కనీస కార్యక్రమాన్ని నిర్ణయించేందుకు ఇండియా కూటమి మూడోసారి ఆర్థిక రాజధాని ముంబైలోని గ్రాండ్ హయత్ హోటల్‌లో గురువారం భేటీ అయింది. భాగస్వామ్య పార్టీల నేతలంతా హాజరు కాగా మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే వారికి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన అనధికారిక భేటీలో శుక్రవారం చర్చల అజెండాను నేతలు ఖరారు చేశారు. భవిష్యత్ కార్యాచరణపైనా చర్చించాలని నాయకులు భావిస్తున్నారు. లోగో ఆవిష్కరణ, సమన్వయ కమిటీ ప్రకటన అజెండాలో ఉన్నట్లు తెలుస్తోంది. గ్రాండ్ హయత్‌లో జరిగిన అనధికారిక సమావేశానికి ముందు శివసేన (యూబీటీ) నేతలు ఆదిత్య ఠాక్రే, సంజయ్ రౌత్, ఎన్సీపీ నేతలు సుప్రియా సూలే, జయంత్ పాటిల్‌తో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముచ్చటించారు. ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్ సరదాగా మాట్లాడుకున్నారు. 'ఇండియా' భేటీలో సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరి, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, బీహార్ సీఎం నితీశ్ కుమార్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్, రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్, జమ్ముకశ్మీర్ మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా, ఆర్ఎల్‌డీ అధ్యక్షుడు జయంత్ చౌదరి, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ, ఆప్ నేత రాఘవ్ చద్దా తదితరులు పాల్గొన్నారు. ఇండియా కూటమి విస్తరణపై చర్చిస్తున్నామని, కూటమిలో చేరతామని ఇప్పటికే ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించిన మూడు పార్టీలు-అసోం గణపరిషత్, రాజోర్ దాల్, అంచలిక్ గణ మంచ్-భుయాన్ కోరాయని కూటమి వర్గాలు తెలిపాయి. కూటమికి సంబంధించిన లోగోను, 11 మంది సభ్యులతో కూడిన సమన్వయ కమిటీని శుక్రవారం ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. సమన్వయ కమిటీకి కన్వీనర్‌ను ప్రకటించడమా...సీట్ల సర్దుబాటు, ఉమ్మడి ఆందోళన కార్యక్రమాలు, కమ్యూనికేషన్ వ్యూహం, కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందించడానికి ఉపసంఘాలు ఏర్పాటు చేయడమా అనే అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది.

కాంగ్రెస్ గూటికి షర్మిల !

- సోనియా, రాహుల్‌తో భేటీ
- పార్టీ విలీనంపై మంతనాలు
- తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశం
- కేసీఆర్ కౌంట్‌డౌన్ ప్రారంభం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దిల్లీ కేంద్రంగా కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ (వైఎస్ఆర్ టీపీ) రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కీలక భేటీ నిర్వహించారు. గురువారం ఉదయం సోనియా నివాసానికి షర్మిల, ఆమె భర్త బ్రదర్ అనిల్‌కుమార్ వెళ్లారు. ఏపీ సీఎం వైఎస్ జగన్ సోదరి షర్మిల ఈ భేటీ నిర్వహించడం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. వైఎస్ఆర్ టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం అంశంపై సోనియాతోను, రాహుల్‌తోను ఆమె ప్రస్తావించినట్లు తెలిసింది. కొంతకాలం క్రితం కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో బెంగళూరులో షర్మిల సమావేశమయ్యారు. అప్పటి నుంచి ఆమె పార్టీ కాంగ్రెస్‌లో విలీనంపై ప్రచారం ఊపందుకుంది. తెలంగాణలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే లక్ష్యంతోనే తాము కాంగ్రెస్‌తో కలిసి వెళ్లేందుకు సిద్ధమైనట్లు వైఎస్ఆర్ టీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. కొంతకాలం క్రితం షర్మిల దిల్లీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతోనూ మంతనాలు జరిపారు. తిరుగు ప్రయాణంలో ఆమె ప్రయాణించిన విమానంలో కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరికను టీ.పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆయన వర్గం తొలి నుంచి వ్యతిరేకిస్తున్నారు. తెలంగాణ కంటే ఆంధ్రాలోనే కాంగ్రెస్‌కు ఆమె అవసరం ఉందని చెప్పుకొస్తున్నారు. షర్మిలకు కాంగ్రెస్‌లోని వైఎస్ వర్గం నేతలు ఎంపీ కోమటిరెడ్డితోపాటు సీనియర్ నేతలు మల్లు భట్టి విక్రమార్క తదితరులు మద్దతిస్తూ పార్టీలోకి స్వాగతిస్తున్నారు. తెలంగాణలో షర్మిల రాజకీయం కాంగ్రెస్‌కు నష్టమని రేవంత్‌రెడ్డి వర్గం వాదిస్తోంది. దీనిని వైఎస్ వర్గం నేతలు తప్పుపడుతున్నారు. కేసీఆర్ సైతం టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి...ఏపీకి చెందిన ఇద్దరు నేతలకు కీలక పదవులు ఇచ్చిన

- మిగతా 2 లో

బీహెచ్ఈఎల్ గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో

ఏఐటీయూసీ విజయకేతనం

విశాలాంధ్ర-విశాఖ: విశాఖలోని బీహెచ్ఈఎల్ గుర్తింపు కార్మికసంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ ఘనవిజయం సాధించింది. గురువారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 445 ఓట్లలో 441 ఓట్లు పోలయ్యాయి. హోరాహోరీ పోరులో బీహెచ్‌పీవీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ), టీఎన్‌టీయూసీ మిత్రపక్షాల కూటమి విజయకేతనం ఎగురవేసింది. ఎన్నికల్లో మూడు ప్యానెల్‌లు బరిలో నిలిచాయి. పోలింగ్ అనంతరం ఎన్నికల అధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులు ఫలితాలు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో బీహెచ్‌పీవీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్‌కు 225, బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయీస్ యూనియన్‌కు 197, బీహెచ్ఈఎల్ కార్మిక సంఘ్‌కు 16 ఓట్లు రాగా 3 ఓట్లు చెల్లలేదని శ్రీనివాసులు తెలిపారు.

ఇది కార్మిక విజయం

బీహెచ్ఈఎల్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో తమ ప్యానెల్ ఘన విజయం సాధించడం పట్ల ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు రావుల రవీంద్రనాథ్, కార్యదర్శి పడాల రమణ హర్షం వెలిబుచ్చారు. ఇది కార్మిక విజయమని పేర్కొన్నారు. తమ మిత్రపక్షాల కూటమిని ఓడించడానికి సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, వైఎస్ఆర్‌టీయూసీ కూటమిగా పోటీ చేసినప్పటికీ కార్మికవర్గం ఏఐటీయూసీ కూటమికే

- మిగతా 2 లో

సెప్టెంబర్ 18-22 తేదీల్లో పార్లమెంట్ ప్రత్యేక భేటీ

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఐదు రోజులపాటు నిర్వహించాలని మోదీ సర్కారు నిర్ణయించింది. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు.

2లో

ఇదీ లోకం!

'బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ'

నేటి నుంచి టీడీపీ రాష్ట్రవ్యాప్త ప్రచారం

ప్రజల సహకారం, భాగస్వామ్యం కోరుతూ చంద్రబాబు లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో తెలుగుదేశం పార్టీ సెప్టెంబరు 1 నుంచి రాష్ట్రవ్యాప్త ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తుంది. 45 రోజులపాటు సాగనున్న ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నేరుగా రాష్ట్రంలోని మూడు కోట్ల మంది ప్రజలను కలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములై సహకరించాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం బహిరంగలేఖ విడుదల చేశారు. 2014-19 మధ్య రెండంకెల వృద్ధితో ప్రతిరంగంలో అగ్రగామిగా ఉన్న నవ్యాంధ్రను నేటి పాలకులు నాలుగున్నరేళ్లలో సర్వనాశనం చేశారు. నాడు అద్భుతంగా పురోగమించిన రాష్ట్రం ..నేడు అధఃపాతాళానికి పడిపోయింది. భస్మాసుర పాలనలో అన్ని వర్గాల ప్రజలు అల్లాడిపోతున్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేవు. మహిళా సాధికారత, భద్రత

- మిగతా 2 లో

హోరెత్తిన యర్రగుంట్ల

సీపీఐ రోడ్‌షోకు అపూర్వ ఆదరణ

దప్పవాయిద్యాలు, విప్లవగీతాలతో ఆకట్టుకున్న ప్రజానాట్యమండలి

పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందిన కడప జిల్లా యర్రగుంట్లకు గురువారం ఉదయం సీపీఐ బస్సు యాత్ర చేరుకోగానే ప్రజానాట్య మండలి కళాకారులు దప్పు వాయిద్యాలతో విప్లవ గీతాలు ఆలపిస్తూ స్వాగతించారు. ఈ ప్రాంతంలోని జువారి, ఎర్రగుంట్ల, చిలమకూరు ఐసీఎల్ సిమెంటు పరిశ్రమలతో పాటు ఆర్టీపీపీ నుంచి తరలివచ్చిన ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు సీపీఐ నేతలకు ఎదురెళ్లి సాదర స్వాగతం పలికారు.

8లో

సీఎంకు ఊరట

విదేశాలకు వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డికి సీబీఐ కోర్టులో గురువారం ఊరట లభించింది. విదేశాలు వెళ్లేందుకు అనుమతి కోరుతూ వారిద్దరూ పిటీషన్లు దాఖలు చేయగా, బుధవారం దానిపై ఉభయపక్షాల వాదనలు విన్న సీబీఐ కోర్టు తీర్పును వాయిదా వేస్తూ ఈరోజు వారిద్దరికీ అనుమతి ఇచ్చింది. సెప్టెంబర్ 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు

- మిగతా 2 లో

ఘనంగా మలేసియా 66వ స్వాతంత్ర్య దినోత్సవం

కౌలాలంపూర్: మలేసియా 66వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. పెరేడ్‌లు, బాణాసంచా పేలుళ్లు, జనసమూహాలతో సందడిగా స్వాతంత్ర్య వేడుక జరిగింది. భిన్నవర్గాల మధ్య ఐక్యత ఉద్దేశంతో ఈసారి వేడుకలను వైభవంగా నిర్వహించారు. దేశభక్తి గీతాలు ఆలపిస్తూ, అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఓ ఉత్సవంగా స్వాతంత్ర్య దినాన్ని మలేసియా ప్రజలు జరుపుకున్నారు. గురువారం ఉదయం వేడుకల్లో మలేసియా రాజు సుల్తాన్ అబ్దుల్లా సుల్తాన్ అహ్మద్ షా, ప్రధాని అన్వర్ ఇబ్రహీం, కేబినెట్ సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. పెరేడ్‌లో వేలాది మంది సైనికులు పాల్గొన్నారు. కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. సుల్తాన్ అబ్దుల్లా ఈ సందర్భంగా ఐక్యతా సందేశాన్ని మలేసియా ప్రజలకు ఇచ్చారు. ఆగ్నేయాసియా ప్రజలు సామరస్యంగా, సుసంపన్నంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. దేశ సుస్థిరత, సౌభాగ్యానికే కాకుండా ప్రస్తుత, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఐకమత్యం అనే శక్తిని మరింత పెంచుకోవడం ప్రతి పౌరుడు, నాయకుడి బాధ్యత అని సుల్తాన్ అన్నారు. 1957, ఆగస్టు 31న బ్రిటీష్ నుంచి ఫెడరేషన్ ఆఫ్ మలయాకు స్వాతంత్ర్యం లభించింది.

విశాలాంధ్ర ప్రపంచం

అణ్వస్త్రాలతో ఉ.కొరియా విన్యాసాలు

ప్యాంగ్యాంగ్: అమెరికా, దక్షిణ కొరియా సైనిక విన్యాసాలకు ప్రతిస్పందనగా ఉత్తర కొరియా అణ్వాస్త్రాలతో విన్యాసాలు నిర్వహించింది. ఈ మేరకు కొరియన్ పీపుల్స్ ఆర్మీ జనరల్ స్టాఫ్ (కేపీఏ) ప్రకటన పేర్కొంది. ఆగస్టు 30న తూర్పు, పశ్చిమ సముద్రాల మీదగా గగనతలంలో డీపీఆర్‌కే, రిపబ్లిక్ ఆఫ్ కొరియా సైన్యంపై బీ-1బీ అణు బాంబర్లతో దాడులను అమెరికా సామ్రాజ్యవాదులు చేయించారు. దీనికి ప్రతిఘటనగా కేపీఏ వ్యూహాత్మక అణు డ్రిల్‌ను చేపట్టింది. ప్రధాన కమాండ్ సెంటర్లు, ఆపరేషనల్ ఎయిర్‌ఫీల్డ్స్ వద్ద విన్యాసాలు నిర్వహించింది. ఉత్తర కొరియా విన్యాశాలను జపాన్ తీవ్రంగా ఖండించింది. క్షిపణి ప్రయోగాలతో పాటు ఉత్తర కొరియా చేపడుతున్న చర్యలన్నీ తమ దేశ శాంతికి ప్రమాదకరమని పేర్కొంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాలను ఉత్తర కొరియా ఉల్లంగిస్తోందని ఆరోపించింది. ప్రపంచ ప్రజల భద్రతకు ముప్పుగా పరిణమిస్తుందని వెల్లడించింది. ఆగస్టు 21-31 తేదీల్లో 'ఉల్చి ఫ్రీడమ్ షీల్డ్' పేరుతో అమెరికా, దక్షిణ కొరియా చేపట్టిన విన్యాశాలలో భాగంగా బుధవారం బీ-1బీ వ్యూహాత్మక బాంబర్ ప్రయోగం జరిగింది.

జొహనెస్‌బర్గ్‌లో అగ్ని ప్రమాదం

73 మంది సజీవదహనం

జొహనెస్‌బర్గ్: దక్షిణాఫ్రికా, జొహనెస్‌బర్గ్‌లో బహుళ అంతస్తు భవనంలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 73 మంది సజీవదహనం కాగా మరో 52 మంది గాయపడ్డారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య మరింత పెరగవచ్చని జొహనెస్‌బర్గ్ అత్యవసర సేవల అధికార ప్రతినిధి రాబర్ట్ ములౌడ్జి వెల్లడించారు. అగ్నిమాపక దళాలు తీవ్రంగా శ్రమించి మంటలను అదుపు చేసినట్లు తెలిపారు. అర్ధరాత్రి 1.30గంటలకు తమకు సమాచారం అందిందని చెప్పారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగిందో ముందు తెలియలేదన్నారు. అయితే అక్రమ విద్యుత్ కనెక్షన్ లేదా ఏదేని పరికరం వేడెక్కడం వల్ల మంటలు వ్యాపించి వుండవచ్చని వెల్లడించారు. అనేకమంది సజీవ దహనమయ్యారని, కాలిన మృతదేహాలను వెలికితీశామని తెలిపారు. జొహనెస్‌బర్గ్ సిటీ కౌన్సిల్ స్పీకర్ కొల్లీన్ మఖుబెలా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అక్రమ కట్టడాల్లో నివాసం ఉండరాదని, అవి సురక్షితం కాదని అన్నారు. ఇటువంటి అసురక్షితమైన భవనాల నుంచి ప్రజలను ఖాళీ చేయించాలని అనుకున్న ప్రతిసారి పౌర సంఘాలు అట్టుకుంటాయని చెప్పారు. కాగా, ప్రస్తుతం ప్రమాదానికి గురైనది పాతబడిన బంగ్లా కాగా కొంతమంది అందులో అక్రమంగా ఉంటున్నారని, మంటలు చెలరేగినప్పుడు 100 మందికిపైగా భవనంలో ఉన్నారని మీడియా నివేదికలు పేర్కొన్నాయి. ఇదే తరహా కబ్జాకు గురైన ఖాళీ భవనాలు జొహనెస్‌బర్గ్‌లో చాలానే ఉన్నట్లు తెలుస్తోంది.

జీ20కి జిన్‌పింగ్ రావడంలేదు

బీజింగ్: భారత్‌లో వచ్చే వారం జరగబోయే జీ20 శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పాల్గొనడం లేదు. ఆ దేశ ప్రధాని లీ కియాంగ్ హాజరు కానున్నారు. జిన్‌పింగ్‌తో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భేటీ ఉండటమే ఇందుకు కారణం కావచ్చన్న ఊహాగానాలు ఉన్నాయి. ఇటీవల బ్రిక్స్ సమావేశంలో జిన్‌పింగ్ పాల్గొని భారత ప్రధాని మోదీను పలుకరించారు. 2020లో జరిగిన గాల్వాన్ ఘర్షణ తర్వాత చైనా, భారత్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. సెప్టెంబరు 9,10 తేదీల్లో భారత రాజధాని న్యూదిల్లీలో జీ20 సమావేశాలు జరగనున్నాయి. కియాంగ్... బీజింగ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని, జిన్‌పింగ్ రావడం లేదని వర్గాలు తెలిపాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా ఈ సమావేశాలకు హాజరు కావడం లేదు. ఆయనకు బదులు ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ జీ20 సమావేశాల్లో పాల్గొనున్నారు. ఈ మేరకు సందేశాన్ని భారత్‌కు రష్యా పంపింది.

లోకేశ్ పాదయాత్రలో కుటుంబ సభ్యులు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువ గళం పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకొని 2700 కిలోమీటర్లు పూర్తి అయిన సందర్భంగా పోలవరం నియోజకవర్గం కొయ్యలగూడెం మండలం సీతంపేట బయ్యనగూడెం గ్రామాల మధ్య బాలన్ గంగాధరరావు అనే రైతుకు చెందిన సెంటున్నర భూమిని పైలాన్ ఏర్పాటుకు ఉచితముగా ఇవ్వడంతో 516 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఆ భూమిలో 200 రోజులు పూర్తి చేసుకుని 2700 వందల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న పైలాన్ స్థూపాన్ని లోకేశ్, ఆయన తల్లి నారా భువనేశ్వరి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మొదలైన పాదయాత్ర లో రైతు నాయకులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పరిమి రాంబాబు రైతులతో కలిసి వర్జీనియా పొగాకుతో తయారుచేసిన గజమాలను లోకేశ్‌కు అందజేశారు. పాదయాత్ర బయ్యనగూడెం గ్రామంలోకి చేరుకోగా పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు నాగలిని లోకేశ్‌కు బహుకరించారు. భోజనం విరామం తర్వాత కొయ్యలగూడెం లో గిరిజన గ్రామాల ప్రజలతో ఏర్పాటు చేసిన ముఖాముఖి సమావేశంలో మాట్లాడుతూ గిరిజనులను అభివృద్ధి చేయడానికి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. గిరిజనులకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నట్టు తెలిపారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదోవ పట్టిస్తూ గిరిజన ప్రాంతాల అభివృద్ధిని గాలికి వదిలేసారన్ ప్రభుత్వంపై మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి మహిళలతో కలిసి ఆమె నివాసం వద్ద గుమ్మడికాయతో హారతి ఇచ్చారు. ఈ పాదయాత్రలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎంకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

లండన్‌లో ఉన్న తన కుమార్తెలను చూడటానికి కుటుంబ సమేతంగా వెళ్లేందుకు అనుమతివ్వాలని సీఎం జగన్ కోర్టును కోరారు. ఆ మేరకు ధర్మాసనం సీఎంకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.
విజయసాయిరెడ్డికి కూడా విదేశాలు వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. యూనివర్సిటీలతో ప్రభుత్వ ఒప్పందాల కోసం బ్రిటన్, అమెరికా జర్మనీ, దుబాయ్ సింగపూర్ దేశాల్లో పర్యటించాల్సి ఉందని, అందుకు అనుమతి ఇవ్వాలని విజయసాయి రెడ్డి కోరగా, సీబీఐ కోర్టు ఆయనకు కూడా అనుమతి ఇచ్చింది.

ఏఐటీయూసీ విజయకేతనం

(మొదటిపేజీ తరువాయి)

విజయం లభించిందని తెలిపారు. ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు పన్నినా అంతిమ విజయం ఏఐటీయూసీనే వరించిందన్నారు. ఫలితాల అనంతరం బీహెచ్‌పీవీ టౌన్‌షిప్‌లో భారీ ర్యాలీ నిర్వహించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

విజయోత్సవంలో బీహెచ్‌పీవీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పీవీఎన్ రాజు, మిత్రపక్షాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ విజయం తథ్యం

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

విశాలాంధ్ర-వేంపల్లె: రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తెలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్ విజయం తథ్యమని తెలంగాణ కాంగ్రెస్ శాసనసభాపక్ష నాయకుడు మల్లు భట్టివిక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలం ఇడుపులపాయ వైఎస్సార్ ఎస్టేట్‌లో గురువారం దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధి వద్ద భట్టివిక్రమార్క నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీజేపీ అసమర్ధ విధానాల వల్ల అటు దేశం... ఇటు తెలుగురాష్ట్రాలలో అనిశ్చిత పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రధాని మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలు విసుగు చెందారన్నారు. ఇలాంటి స్థితిలో రెండు రాష్ట్రాల్లోనూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ వ్యతిరేక విధానాలు, సీఎం కేసీఆర్ ఒంటెద్దు పోకడల విసిగి వేసారిన ప్రజలు ఈ సారి కాంగ్రెస్‌కు పట్టంకట్టేందుకు సిద్దంగా ఉన్నారన్నారు. దివంగతనేత వైఎస్సార్ రాజశేఖర్‌రెడ్డి విలక్షణమైన రాజకీయవేత్తగా పేరు సాధించారన్నారు. వైఎస్సార్ స్ఫూర్తిగా తీసుకుని తాను కూడా తెలంగాణలో పాదయాత్ర చేశానన్నారు. రాహుల్‌ను ప్రధానిగా చూడాలన్న వైఎస్సార్ కల సాకారమవుతుందన్నారు. దేశమంతటా కాంగ్రెస్ గాలి బలంగా వీస్తోందన్నారు. తమపార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రకు విశేష స్పందన లభించిందన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశమంతటా కాంగ్రెస్‌పార్టీ జయకేతనం ఎగురవేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ'

(మొదటిపేజీ తరువాయి)

అటకెక్కింది. పెట్టుబడుల మాటే లేదు. నిరుద్యోగం పెరిగిపోయింది. బడుగు, బలహీన వర్గాలపై దాడులు నిత్యకృత్యమయ్యాయి. ప్రభుత్వ దోపిడీతో పేదలు మరింత పేదలయ్యారు. సహజ వనరులను, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను దోచేస్తూ సైకో ప్రభుత్వం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టింది. వైసీపీ మాఫియా రాజ్యంలో మీ భవిష్యత్తు... మరీ ముఖ్యంగా మీ పిల్లల భవిష్యత్తు నాశనమైంది. ఈ పరిస్థితుల్లో మళ్లీ నవ్యాంధ్రలో మీ అందరి సహకారంతో వెలుగులు నింపడానికి టీడీపీ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. నెలన్నర పాటు కొనసాగే ఈ ప్రచార కార్యక్రమంలో మీ ఆర్థిక పరిపుష్టి, రక్షణ, భవిష్యత్తు కోసం రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల ఉద్దేశాలను, వాటి వలన కలిగే ప్రయోజనాలను మీకు వివరిస్తారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వాటి పూర్తిస్థాయి అమలుకు నా హామీని స్వయంగా మీ ఇంటికి వచ్చి అందిస్తారు. మీ సమస్యలపై వారితో చర్చించండి...వారిని ఆదరించండి...ఆశీర్వదించండి. మన రాష్ట్ర భవిష్యత్తు కోసం తెలుగుదేశంతో కలిసి అడుగులు వేయాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం మహిళలకు తల్లికి వందనం పేరుతో పిల్లలకు రూ.15వేలు, ఆడబిడ్డ నిధి కింద ప్రతి స్త్రీకి నెలకు రూ.1500, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు అందజేస్తామని, అన్నదాతకు రూ.20వేల ఆర్థిక సహాయం, నిరుద్యోగులకు నెలకు రూ.3వేల భృతి, 20 లక్షల ఉద్యోగ అవకాశాలు, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, ఇంటింటికీ రక్షిత తాగునీటి కుళాయి, పేదలను ధనికులుగా మార్చే కార్యక్రమాల ద్వారా పేదరికం లేని సమాజం వైపు రాష్ట్రాన్ని తీసుకువెళతామని తెలిపారు. మనందరి బాగుకోసం, మన పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడం కోసం...ఇంకా ఏమేం చేయమంటారో కూడా మీ ఇంటికి వచ్చే మా పార్టీ ప్రతినిధులకు తెలియజేయండి. మీ అందరి సలహాలతో మేనిఫెస్టో రూపొందిస్తాను. దానిని దసరాకు విడుదల చేస్తానని చంద్రబాబు తెలిపారు. మీకోసం మీ ఇంటికి, మీ ప్రాంతాలకు వచ్చే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు, బృందాలకు పూర్తిగా సహకరించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ గూటికి షర్మిల !

(మొదటిపేజీ తరువాయి)

విషయాన్ని గుర్తుచేస్తున్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ నేతలకు ఆంధ్రా వారితో కుటుంబ సంబంధాలున్నాయని నొక్కిచెబుతున్నారు. తనను రేవంత్‌రెడ్డి అడ్డుకుంటున్న వైఖరిని గమనించి షర్మిల...డీకే శివకుమార్ సూచనలతో నేరుగా సోనియా, రాహుల్‌తో వ్యూహాత్మకంగా భేటీ అవ్వడం చర్చనీయాంశంగా మారింది.

విలీన జాప్యానికి కారణాలు

కాంగ్రెస్‌లో షర్మిల పార్టీ విలీనానికి సంబంధించి జరుగుతున్న జాప్యానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. తెలంగాణలోనే తాను రాజకీయం చేస్తానని షర్మిల ప్రకటించడం, తనతో కలిపి ఐదుగురు వైఎస్ఆర్ టీపీ నేతలకు టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేయడం, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో కీలక పదవి కోసం పట్టుబట్టడం విలీన ప్రక్రియ జాప్యానికి కారణాలుగా తెలుస్తున్నాయి. నిజానికి కాంగ్రెస్‌లోకి షర్మిల ప్రవేశించిన వెంటనే అక్కడ ఆమెకు వైఎస్ఆర్ అభిమానులు, అనుచరులతో కలిపి ఒక వర్గం ఏర్పడుతుంది. దీంతో రేవంత్‌రెడ్డికి ఊహించని విధంగా గట్టి పోటీ ఏర్పడే అవకాశముంది. దీనిని ముందస్తుగానే గుర్తించిన రేవంత్‌రెడ్డి, ఆయన వర్గీయులు షర్మిల చేరికకు అడ్డుపడుతున్నారని, అందుకే ఆమె చేరికలో జాప్యం జరుగుతోందని సమాచారం. తన రాజకీయ వ్యవహారాలు తెలంగాణ నుంచే కొనసాగిస్తానని షర్మిల ఇప్పటికే అనేకసార్లు స్పష్టం చేసింది. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. ఆయన రాహుల్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన వైఎస్ఆర్ కుటుంబానికి సన్నిహితుడు. 2014 ఎన్నికల్లో వైసీపీ తరపున ఖమ్మం ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం టీఆర్ఎస్‌లోకి వెళ్లి, అక్కడ ఇమడలేక కాంగ్రెస్‌లో చేరారు. తొలుత ఖమ్మం జిల్లాలోని పాలేరు నుంచి పోటీ చేస్తానని షర్మిల ప్రకటించారు. అక్కడ ఆమె పార్టీ, క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నారు. పొంగులేటి కాంగ్రెస్‌లోకి వెళ్లడం వెనుక వైఎస్ షర్మిల పాత్ర ఉన్నట్లు సమాచారం. ఆమె కాంగ్రెస్‌లో చేరితే పాలేరు నుంచి పోటీ ఖరారైనట్లే. షర్మిలకు చెక్ పెట్టేందుకుగాను రేవంత్‌రెడ్డి వర్గం ఖమ్మం జిల్లాకు చెందిన టీఆర్ఎస్ నేత తుమ్మల నాగేశ్వరరావును కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తోంది. ఆయన వస్తే పాలేరు టికెట్ ఆయనకు ఇవ్వాలని భావిస్తోంది. షర్మిల నేరుగా దిల్లీ వెళ్లి సోనియా, రాహుల్‌తో భేటీ కావడంతో తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి. అధిష్ఠానం షర్మిల ముందు రెండు ప్రతిపాదనలు ఉంచినట్లు తెలిసింది. అందులో మొదటిది...పాలేరు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయడం, రెండోది... కర్నాటక నుంచి రాజ్యసభకు ఎన్నికై తెలుగు రాష్ట్రాల్లో ప్రచారం చేయడం. ఇందులో మొదటి ప్రతిపాదనకే షర్మిల మొగ్గు చూపినట్లు సమాచారం. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేదీ ఉత్కంఠగా మారింది. ఆంధ్రాలోనూ షర్మిల తనదైన ముద్ర వేసుకున్నారు. వైసీపీ విజయం కోసం షర్మిల, విజయమ్మ విస్తృతంగా ప్రచారం చేశారు. తాను జగనన్న వదిలిన బాణం అంటూ ప్రచారరంగంలో దిగారు. ఆ తర్వాత షర్మిల తెలంగాణలో సొంతంగా పార్టీ పెట్టుకుని అక్కడి సమస్యలపై సుదీర్ఘకాలం పాదయాత్ర చేశారు.

తెలంగాణ ప్రజల కోసం కృషి: షర్మిల

సోనియాగాంధీతో భేటీ అనంతరం వైఎస్ షర్మిల మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలకు మేలు చేసే దిశగా తమ మధ్య చర్చలు నడిచాయన్నారు. తెలంగాణ ప్రజలకు మేలు చేసేలా వైఎస్ఆర్ బిడ్డనైన తాను నిరంతరం పనిచేస్తానని చెప్పారు. కేసీఆర్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో వైఎస్ఆర్ టీపీ విలీనంపై చర్చించారా అనే ప్రశ్నకు ఆమె సమాధానం దాట వేశారు.

పెండింగ్ జీతాల ఊసేది..?

మూడు నెలలుగా కొలిక్కిరాని క్యాడర్ స్ట్రెంత్ వ్యవహారం

రాష్ట్ర ఖజానా కార్యాలయాన్ని ముట్టడించక తప్పదు

తిమ్మన్న హెచ్చరిక

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయులు జీతాలు చెల్లించక... క్యాడర్ స్ట్రెంత్ సమస్యను కారణంగా ఇంకెన్నాళ్లు చూపుతారని పాఠశాల విద్యాశాఖ అధికారులను రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న సూటిగా ప్రశ్నించారు. గురువారం మంగళగిరిలోని నిధి భవన్‌లో పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఎం.రామలింగంను తిమ్మన్న కలిసి ఉపాధ్యాయుల పెండింగ్ జీతాలు, క్యాడర్ స్ట్రెంత్ నవీకరణపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మూడు నెలలుగా ఉపాధ్యాయుల జీతాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. విద్యాశాఖలోని క్యాడర్ స్ట్రెంత్‌ను నవీకరించడానికి మూడు నెలల సమయం సరిపోలేదా అని ప్రశ్నించారు. గత వేసవి సెలవులలో ఆర్థిక శాఖ అనుమతి లేకుండా విద్యాశాఖ పదోన్నతులు, బదిలీలు నిర్వహించింది. ఇప్పుడు ఆర్థిక శాఖ ఆమోదం కోసం క్యాడర్ స్ట్రెంత్ నవీకరణ అంటూ మూడు నెలలుగా ఆర్థిక శాఖ ఖజానాల చుట్టూ తిరుగుతుందన్నారు. ఇది ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నేటికీ క్యాడర్ స్ట్రెంత్ నవీకరణ కాలేదని, ఈ సమస్య ఇప్పుడు పరిష్కారం అయ్యేలా లేదన్నారు. జీతాలు లేక ఉపాధ్యాయుల కుటుంబాలు ఆర్థికంగా...మానసికంగా ఎంతో క్షోభకు గురవుతున్నారని తిమ్మన్న ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌టీఎస్ రోడ్డు ఉద్యమ ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై ప్రతీకారం తీర్చుకుంటున్నట్లు ఉందని ఆయన మండిపడ్డారు. సెప్టెంబరు మొదటి వారంలో పెండింగ్ ఉన్న జూన్, జులై, ఆగష్టు జీతాలు చెల్లించాలని డిమాండు చేశారు. అలా చేయని పక్షంలో రెండో వారంలో రాష్ట్ర ఖజానా కార్యాలయాన్ని ముట్టడించడానికి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం వెనుకాడదని తిమ్మన్న హెచ్చరించారు.

అదానీ మరో మోసం

(మొదటిపేజీ తరువాయి)

బహిర్గతం కావాలంటే జేపీసీ జరిపించాల్సిందేనన్నారు. అదానీ వ్యవహారంలో సమగ్ర విచారణ అనివార్యమని నొక్కిచెప్పారు. దీనిపై ప్రధాని ఎందుకని మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. విచారణకు ఆదేశాలు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. 'అదానీ వ్యవహారంలో ప్రముఖ అంతర్జాతీయ ఆర్థిక వార్తాసంస్థలు కీలక ప్రశ్నలను సంధించాయి. జీ20 వేళ భారత ప్రతిష్ఠ పణంగా ఉంది. అదానీ వ్యవహారంలో ప్రధాని సత్వరమే తగు చర్యలను చేపట్టాలి. వెంటనే విచారణకు ఆదేశాలివ్వాలి' అని రాహుల్ గాంధీ అన్నారు. అదానీ గ్రూపుతో సంబంధమున్న డొల్ల కంపెనీలపై విచారణలో సెబీ పాత్ర గురించి ఎక్స్ మాధ్యమంగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేసినప్పటికీ నిజం ఎంతో కాలం దిగివుండలేదని అన్నారు. బినామీ పెట్టుబడుల గుట్టు రట్టు కాక మానదని వ్యాఖ్యానించారు. కేవలం జేపీసీ ద్వారా నిజాలు వెలుగు చూడగలవన్నారు. తన సన్నిహితుల కోసం అన్ని నియమాలు, నిబంధనలను ప్రధాని మోదీ అతిక్రమిస్తున్నారని జైరాం రమేశ్ విమర్శించారు. వామపక్షాలు కూడా మోదీ-అదానీ స్నేహాన్ని దుయ్యబట్టాయి. గుజరాతీలు కాబట్టి సహకరించుకుంటున్నారని ఎద్దేవా చేశాయి. అదానీ స్టాక్‌ల అమ్మడం, కొనడం వంటివి అక్రమ పద్ధతిలో ఏళ్లుగా సాగుతుంటే ఎలాంటి చర్యలు తీసుకోకుండా మోదీ చూసుకుంటున్నారని విమర్శించాయి.

సెప్టెంబర్ 18-22 తేదీల్లో పార్లమెంట్ ప్రత్యేక భేటీ

న్యూదిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఐదు రోజులపాటు నిర్వహించాలని మోదీ సర్కారు నిర్ణయించింది. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడించారు. జీ20 సదస్సు ముగిసిన తర్వాత జరిగే ఈ సమావేశాల అజెండా ఏమిటనే విషయంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదు. 'పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు ఐదు రోజులపాటు జరగనున్నాయి. అమృత్ కాల్ వేళ ఈ పార్లమెంటు సమావేశాల్లో చర్చలు ఫలప్రదంగా జరగాలని ఆశిస్తున్నాం' అని మంత్రి ప్రహ్లాద్ జోషి ఎక్స్(మాజీ ట్విట్టర్) వేదిగా పేర్కొన్నారు. ప్రస్తుత 17వ లోక్‌సభ 13వ సారి సమావేశమవుతుండగా రాజ్యసభకు మాత్రం ఇది 261వ సమావేశం. ఈ ప్రత్యేక సమావేశాల అజెండా ఏమిటన్న విషయంపై స్పష్టత లేనప్పటికీ... పార్లమెంటు కొత్త భవనంలోకి మారేందుకే ఈ భేటీ అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రాజకీయ లబ్ధి పొందేందుకు కొన్ని కీలక బిల్లులు ఆమోదించుకునేందుకు కూడా సమావేశాలను ఉపయోగించుకోవచ్చని తెలుస్తోంది.

చంద్రయాన్-3 విజయం, అమృతకాలంలో భారత్ లక్ష్యాలపైనా విస్తృత చర్చ జరగవచ్చని సమాచారం. ఈ సమావేశాలు పాత భవనంలో మొదలై... కొత్త భవనంలో ముగుస్తాయని తెలుస్తోంది. వీటితోపాటు జీ20 సదస్సులో కీలక చర్చలు, జమ్ముకశ్మీర్‌లో వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు చెప్పిన నేపథ్యంలో ఈ ప్రత్యేక సమావేశాలకు ప్రాధాన్యత ఏర్పడింది. సాధారణంగా పార్లమెంటుకు సంబంధించి ఏడాదికి మూడు-బడ్జెట్, వర్షాకాలం, శీతాకాల సమావేశాలు జరుగుతాయి.

ప్రతిపక్షాల విమర్శలు

పార్లమెంటు ప్రత్యేక సమావేశాలపై విపక్షాలు మండిపడ్డాయి. వర్షాకాల సమావేశాలు పూర్తయిన మూడు వారాలకే ఐదు రోజులపాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం...విపక్ష కూటమి ఇండియా వరుస సమావేశాలు, అదానీపై తాజాగా వెల్లడైన అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికేనని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. అదానీ వ్యవహారంపై జేపీసీ డిమాండ్ కోసం పార్లమెంటు లోపలా, బయటా పోరాడుతున్నామని, దీనిపై ప్రభుత్వం సానుకూల స్పందన కనిపించడం లేదన్నారు. శివసేన(యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది స్పందిస్తూ భారతదేశంలో అత్యంత కీలకమైన గణేశ్ చతుర్థి పండుగ సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం దురదృష్టకరమని, ఇది హిందువుల మనోభావాలకు వ్యతిరేకమని, ఈ తేదీల ఎంపిక ఆశ్చర్యానికి గురిచేసిందని వ్యాఖ్యానించారు.

డీజీపీ ఆఫీస్‌లోనే అవినీతి ?

విచారణకు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : డీజీపీ కార్యాలయంలోనే అవినీతి పెద్దఎత్తున జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు ఎక్కడ ఏ అన్యాయం జరిగినా అంతిమంగా న్యాయం చేయాల్సిన పోలీస్ హెడ్ క్వార్టర్స్‌ను ఓ ఉద్యోగి అవకాశంగా మలచుకొని పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నట్లు తెల్సింది. డీజీపీ హెడ్ క్వార్టర్స్‌లో పర్సనల్ విభాగంలో ఏఏఓగా విధులు నిర్వహిస్తున్న ముపిరాల బాలసుబ్రమణ్యం అవినీతికి పాల్పడుతున్నట్లు అందిన సమాచారం మేరకు అవినీతి నిరోధక శాఖ(ఏసిబి) విచారణకు గురువారం డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్రపతి క్షమాభిక్ష తిరస్కరిస్తే

మరణశిక్ష ఖైదీకి నో ఛాన్స్

న్యూదిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరంకుశంగా ముందుకు సాగుతూ ఇష్టమొచ్చినట్లు చట్టాలు చేస్తోంది. ఉన్నవాటిని సవరిస్తూ కొత్తగా తీసుకొస్తోంది. ఇదే క్రమంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత బిల్లు (బీఎన్ఎస్ఎస్)ను ప్రవేశపెట్టింది. ఈ బిల్లు చట్టంగా మారితే గనుక మరణశిక్ష పడిన ఖైదీలకు క్షమాభిక్ష పొందే అవకాశాలు సన్నగిల్లుతాయి. ఒకసారి రాష్ట్రపతి క్షమాభిక్షను తిరస్కరిస్తేగనుక దానిపై కోర్టుకు వెళ్లే హక్కు మరణశిక్ష పడిన ఖైదీకి ఉండబోదని బీఎన్ఎస్ఎస్ సూచిస్తుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 72 ప్రకారం రాష్ట్రపతి తీసుకున్న నిర్ణయమే చివరిదని, రాష్ట్రపతి నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కోర్టులకు వెళ్లేందుకు అవకాశం ఉండదని బీఎన్ఎస్ బిల్లులో చేర్చిన సెక్షన్ 473 తెలిపింది. ఒకటే కేసులో మరణశిక్ష పడిన ఖైదీల వేర్వేరు పిటిషన్లపై జాప్యాన్ని తిరస్కరిస్తుంది. ఒకే కేసులోని దోషులకు మరణశిక్ష పడితే వారంతా 60రోజుల్లోగా క్షమాభిక్ష కోసం అర్జీ పెట్టుకునేలా జైలు సూపరింటెండెంట్ చూడాలి. అలా జరగని పక్షంలో ఆయనే స్వయంగా వారి పేర్లు, చిరునామాలు, కేసు రికార్డుల ప్రతులు, ఇతర వివరాలను, ఒరిజినల్ క్షమాభిక్ష పిటిషన్‌ను కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని కొత్త బిల్లు సూచిస్తుంది. సంబంధిత ఖైదీల పిటిషన్లపై రాష్ట్రపతి ఒకేసారి నిర్ణయం తీసుకుంటారని తెలిపింది. క్షమాభిక్ష పిటిషన్ల సమర్పణకు కాలపరిమితిని సూచించింది కానీ వాటిపై నిర్ణయానికిగాను రాష్ట్రపతికి ఎలాంటి గడువు లేదు. రాష్ట్రపతి తిరస్కరించిన క్షమాభిక్ష గురించి సమాచారం 48 గంటల్లోగా రాష్ట్ర హోంశాఖ, జైలు సూపరింటెండెంట్‌కు కేంద్రం అందజేస్తుంది. ఆగస్టు 11న ఈ బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రవేశపెట్టారు. సీఆర్పీసీ స్థానె ఈ బిల్లును కేంద్రం ప్రతిపాదించడం తెలిసిందే.

రేపు నింగిలోకి ఆదిత్య ఎల్-1

- ఉదయం 11.50 గంటలకు ప్రయోగం
- సర్వం సిద్ధం చేసిన ఇస్రో శాస్త్రవేత్తలు

విశాలాంధ్ర -సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుండి సెప్టెంబర్ రెండవ తేదీ ఉదయం 11.50 గంటలకు ఆదిత్య యల్-1ను పీఎస్ఎల్‌వీసీ-57 రాకెట్ ద్వారా శాస్త్రవేత్తలు నింగిలోకి పంపనున్నారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ, యూరోపియన్ స్పేస్, ఆస్ట్రేలియా అంతరిక్ష పరిశోధన సంస్థలతో కలిసి రూపొందిస్తున్న కరోనాగ్రఫీ అంతరిక్ష నౌక సౌర వాతావరణాన్ని అధ్యయనం చేయనుంది. దీన్ని భూమి, సూర్యుల వ్యవస్థలోని ఎల్ వన్ బిందు చుట్టూ ఒక హేలో కక్ష్యలో ప్రక్షేపిస్తారు. ఇక్కడ నుండి ఇది సౌర వాతావరణం, సౌర అయస్కాంత తుపానులను, భూమి పర్యావరణంపై వాటి ప్రభావాన్ని అధ్యయనం చేస్తుంది. ఈ అంతరిక్ష నౌక కరోనాల్ హీటింగ్, సోలార్ విండ్ యాక్సిలరేషన్, కరోనాల్ మేగ్నోటో మెట్రీ, యుని-సమీప సోలార్ రేడియేషన్‌ను అధ్యయనం చేస్తుంది. ఫోటో స్పియర్, క్రోమోస్పియర్, కరోనా, సౌరశక్తి, సూర్యుని అయస్కాంత క్షేత్రాన్ని నిరంతరం గమనిస్తుంది. సూర్యుడిని పరిశీలించడానికి ఉద్దేశించిన మొట్టమొదటి భారతీయ మిషన్ ఇది. ఆదిత్య ఎల్-1 ఐదు సంవత్సరాలు పనిచేస్తుంది. అడ్వయిజర్ కమిటీ ఫర్ స్పేస్ రీసెర్చ్ 2008 జనవరిలో ఆదిత్య ఆలోచన చేసింది. మొదట్లో దీన్ని సౌర కరోనాను అధ్యయనం చేయడానికి కరోనా గ్రాఫ్‌తో భూమిపై కక్ష్యలో ఉండి పనిచేసే చిన్న 400 కేజీల ఉపగ్రహంగా ఆలోచన చేశారు. 2016- 2017 ఆర్థిక సంవత్సరానికి మూడు కోట్ల ప్రయోగాత్మక బడ్జెట్‌ను కేటాయించారు. అప్పటి నుండి ఈ మిషన్ పరిధిని విస్తరించారు. ఇప్పుడు దీనిని లా గ్రాంజ్ పాయింట్ ఎల్-1 వద్ద ఉంచి, ఒక సమగ్ర సౌర అంతరిక్ష పర్యావరణ అబ్జర్వేటరిగా ప్లాన్ చేశారు. అందువల్ల ఈ మిషన్‌కు ఆదిత్య యల్-1 అని పేరు పెట్టారు. ఆదిత్య యల్-1 మిషన్ ప్రయోగించిన 15 రోజుల తర్వాత భూమి నుండి దాదాపు 1,500,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్-1 పాయింట్ వద్ద హేలో కక్ష్యను చేరుకోవడానికి దానికి దాదాపు 109 రోజులు పడుతుంది. 1,500 లక్షల కిలోమీటర్లు అంటే కరోనాల్ హీటింగ్, సోలార్ విండ్ యాక్సిలరేషన్, కరోనాల్ మాగ్నెటోమెట్రీ, సమీపంలోని యువి సోలార్ రేడియేషన్ పర్యవేక్షణ వంటి విభిన్న లక్షణాలతో ఏడు సైన్స్ పేలోడ్‌లను ఈ నౌక నింగిలోకి తీసుకెళ్లనుంది. ఆదిత్య యల్-1 సూర్యుని ఫోటో స్పియర్, క్రోమోస్పియర్, కరోనాల పరిశీలన చేస్తుంది. అదనంగా ఇందులోని ఒక పరికరం ఎల్-1 కక్ష్యకు చేరే సౌరశక్తి కణాల ప్రవాహాన్ని అధ్యయనం చేస్తుంది. మాగ్నోటోమీటర్ పేలోడ్, ఎల్-1 వద్ద ఉన్న హేలోఆర్బిట్ వద్ద అయస్కాంత క్షేత్ర బలంలో వచ్చే అంతరాలను కొలుస్తుంది. ఈ పేలోడులను భూమి అయస్కాంత క్షేత్రం వలన కలిగే అంతరాయాలకి వెలుపల ఉంచాలి. మొదట ప్రతిపాదించిన విధంగా భూ నిమగ్న కక్ష్యలో ఉంటే ఈ వీలు ఉండదు. సౌర భౌతికశాస్త్రంలో పరిష్కారం కానీ ప్రధాన సమస్యల్లో ఒకటి సూర్యుడి దిగువ వాతావరణం కేవలం 6,000 కె ఉంటే, సూర్యుని ఎగువ వాతావరణం మాత్రం 1,000,000 కె ఉండడం... దానికి తోడు సూర్యుని రేడియేషన్‌ను భూ వాతావరణపు డైనమిక్స్‌ను స్వల్పకాలం, దీర్ఘకాలంలో ఎలా ప్రభావితం చేస్తుందో ఇంకా అర్థం కాలేదు. ఈ మిషన్ సూర్యుని వాతావరణంలోని వివిధ పొరల చిత్రాలను దాదాపుగా ఏకకాలంలో సేకరిస్తుంది. ఈ విధంగా ఆదిత్య యూవీ-1 మిషను సూర్యుని గతిశీల ప్రక్రియల గురించి సమగ్ర అవగాహనను కలిగిస్తుంది. సౌర భౌతికశాస్త్రం, హీలియో ఫిజిక్స్‌లోని కొన్ని అపరిష్కృత సమస్యలను పరిష్కరిస్తుంది. ఫోటోస్పియర్, క్రోమోస్పియర్ నుంచి వెలువడే అతినీలలోహిత తరంగాలను ఇది గుర్తిస్తుంది. ఇవి భిన్నమైన పనులు చేస్తాయి. అవి ఏమిటంటే.. సోలార్ అల్ట్రా వయలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్, విజిబుల్ ఎమిషన్ లైన్ కరోనాగ్రాఫ్ కొరోనాపై దృష్టి పెడుతుంది. కాంతితో పాటు పరావరణ తరంగాలను గుర్తిస్తుంది. సూర్యుడి అయస్కాంత క్షేత్రం ఉష్ణోగ్రతను, సాంద్రతను, ఇతర మార్పులను లెక్కిస్తుంది. సాఫ్ట్ అండ్ హార్డ్ ఎక్స్ రే స్పెక్ట్రోమీటర్స్ సూర్యుడి నుంచి వెలువడే ఎక్స్‌లను ఇవి విశ్లేషిస్తాయి. అవి ఏ ప్రాంతం నుంచి వెలువడుతున్నాయో ఆ ప్రాంతం ఉష్ణోగ్రత తదితర వివరాలను వీటి ద్వారా తెలుసుకోవచ్చు. ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్సపరిమెంట్ ఎలక్ట్రాన్లు, ప్రోటాన్ల రూపంలో సూర్యుడి నుంచి వెలువడే రేడియేషన్‌ను సోలార్ విండ్స్ అంటారు. ఈ పరికరం వీటిని విశ్లేషిస్తుంది. ప్లాస్మా ఎనలైజర్ సూర్యుడి నుంచి వెలువడే ప్లాస్మా వివరాలను తెలుపుతుంది. అడ్వాన్స్ ట్రై యాక్సిల్ హై రిజల్యూషన్ డిజిటల్ మ్యాగ్నెటో మీటర్ రేడియేషన్‌తో పాటు వెలువడే అయస్కాంత తరంగాలను గుర్తించి విశ్లేషిస్తుంది. వీటన్నింటి నుంచి వచ్చే సమాచారాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి సూర్యుడిలో కలుగుతున్న మార్పులను, వాటి ప్రభావాన్ని అంచనా వేస్తారు. తద్వారా అవసరమైన సందర్భాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టటానికి అవకాశం లభిస్తుంది. ఆదిత్య ఎల్-1 మిషన్ దాదాపు రూ.400 కోట్లు ఉండవచ్చని సమాచారం. ఈ ప్రయోగానికి సంబంధించి ఇస్రో శాస్త్రవేత్తలు గురువారం ఎంఆర్ఆర్ సమావేశం నిర్వహించారు. ప్రయోగ సమయాన్ని, కౌంట్‌డౌన్ ప్రారంభ సమయాన్ని అధికారికంగా ప్రకటించారు. శుక్రవారం ఉదయం 11.50 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభమై 24 గంటలు ముగిసిన అనంతరం శనివారం ఉదయం 11.50 గంటలకు పీఎస్ఎల్‌వీ సి57 రాకెట్ ద్వారా ఆదిత్య ఎల్-1 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

ఖాజాగూడలో కొత్తయుగపు ఆనవాళ్లు!

పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాదు: ఇక్కడి లాంకోహిల్స్ సమీపంలో కొత్త రాతియుగపు ఆనవాళ్లు వెలుగు చూశాయని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. నగరంలోని అపురూప శిలాకృతు (రాక్‌ఫార్మేషన్)ల వద్ద ఆదిమ మానవుని అడుగుజాడల అన్వేషణలో భాగంగా ఆయన, ప్లీచ్ ఇండియా బృందంతో కలసి గురువారం ఖాజాగూడ-లాంకోహిల్స్ పరిసరాల్లోని మెహర్‌బాబా -అనంతపద్మనాభస్వామి కొండపై పరిశోధనలు కొనసాగించారు. కొత్త రాతియుగపు మానవులు తమ రాతి గొడ్డళ్లను పదునుపెట్టుకోగా ఏర్పడిన రాతి గాట్లను గుర్తించినట్లు ఆయన చెప్పారు. పద్మనాభస్వామి ఆలయదారికి ఇరువైపుల ఉన్న సహజ సిద్ధమైన నాగపడిగె లాంటి రాతి బండల కింద ఆనాటి మానవులు తాత్కాలికంగా నివసించేవారని, ఆ సందర్భంగా రాతి పనిముట్లకు పదును పెట్టుకొనేవారని శివనాగిరెడ్డి తెలిపారు. మెహర్ బాబా గుహకు ఎగువన 50 మీటర్ల దూరంలో నాలుగు చోట్ల 30 సెం.మీ., 20 సెంమీ మధ్య పొడవు, 2 సెం.మీ.ల వెడల్పు, 2-5 సెం.మీ.ల లోతుగల రాతి గాట్లున్నాయని వాటి ఆకారం, అరగదీసిన తీరును బట్టి, ఇవి ఖచ్చితంగా క్రీస్తు పూర్వం 6000-4000 సంవత్సరాల మధ్య కాలానికి చెందినవని శివనాగిరెడ్డి చెప్పారు. నార్సింగి-కోకాపేట, జూబ్లీహిల్స్-బీఎస్ఆర్ హిల్స్‌లో కనిపించిన కొత్త రాతియుగపు ఆనవాళ్లు... హైదరాబాదు నగర పురా చరిత్రకు ఆధారాలు అవుతాయని ఆయన అన్నారు. వీటిని కాపాడుకోవాలని ఆలయ యాజమాన్యానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్లీచ్ ఇండియా పురావస్తు శాస్త్రవేత్తలు మైత్రేయి, దుర్గ, నయన్, సాక్షి, కిరణ్, జితేంద్ర పాల్గొన్నారు.

శ్రీశైలంలో భారీ అగ్ని ప్రమాదం

14 దుకాణాలు దగ్ధం

విశాలాంధ్ర - శ్రీశైలం: ప్రముఖ యాత్ర స్థలమైన శ్రీశైలంలో బుధవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేస్తుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో చెలరేగిన మంటలలో 14 షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మరి కొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. స్థానిక లలితాంబికా షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఎల్ బ్లాక్‌లో అర్ధరాత్రి మంటలు చెలరేగడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. మంటలు గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందిచడంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది... ఆలయ సిబ్బంది సహకారంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. విషయం తెలుసుకున్న వెంటనే ఈవో ఎస్.లవన్న, సీఐ దివాకర్ రెడ్డి, ఎస్సై లక్ష్మణరావు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అగ్నిప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియవలసి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంలో షాపులు అగ్నికి ఆహుతి కావడంతో దుకాణదారులు కన్నీరు మున్నీరవుతున్నారు. బాధితులను ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి పరామర్శించి, తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ. 20వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వంతో మాట్లాడి రాష్ట్ర పరిహారం అందించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పది రోజుల్లోగా దుకాణాలను నిర్మించాలని ఎమ్మెల్యే ఆలయ అధికారులను ఆదేశించారు. అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఆస్తి విలువ రూ.3 కోట్లు ఉండొచ్చని అంచనా.

ఏనుగుల దాడిలో మృతి చెందిన కుటుంబానికి

రూ.60 లక్షల పరిహారం చెల్లించాలి

రైతు సంఘం, సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర - గుడిపాల: చిత్తూరు జిల్లా గుడిపాల మండలం 190 రామాపురంలో బుధవారం ఏనుగు దాడిలో మృతి చెందిన వెంకటేశ్,సెల్వి కుటుంబానికి రూ.60 లక్షలు నష్టపరిహారం అందజేయాలని సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టి.జనార్ధన్ డిమాండ్ చేశారు. గురువారం ఉదయం రైతు సంఘం, సీపీఐ నాయకులు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలలో పాల్గొని అనాథలైన వారి కుమారులను ఓదార్చి సీపీఐ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాల్లో ఏనుగుల దాడి వల్ల చిత్తూరు జిల్లాలో 25 మంది ప్రాణాలు కోల్పోయారనీ దీనికి పూర్తి బాధ్యత అటవీశాఖ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని చెప్పారు. సోలార్ ఫెన్సింగ్ నిర్మించడంలో అలసత్వం వల్లే ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. 2004లో అత్యున్నత స్థాయి కమిటీ రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రతిపాదిస్తే నేటికి ఐదు లక్షల రూపాయలు మాత్రమే అందించడం శోచనీయం అన్నారు. ఇటీవల తిరుమలలో చిరుత వాతపడ్డ చిన్నారి కుటుంబానికి కనీసం రూ.30 లక్షలు పరిహారం చెల్లించాలని హైకోర్టు బెంచ్ సూచించిన విషయం ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ మేరకు ఏనుగు దాడిలో చనిపోయిన కుటుంబానికి రూ.60 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించడంతో పాటు అనాథలైన ముగ్గురు కుమారులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండు చేశారు. ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన రైతాంగానికి పరిహారం, తీవ్రంగా గాయపడ్డ రైతుకు ప్రభుత్వమే వైద్య సదుపాయం అందజేసి తగు పరిహారం చెల్లించాలని కోరారు. ప్రభుత్వం పేద రైతుల విషయంలో ఉదాసీనత వహిస్తే రైతు సంఘం, సీపీఐ తరఫున ఉద్యమానికి సన్నద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మణి, రఘు, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యం,మురుగేశ్ పాల్గొన్నారు.

జగన్‌కు బ్రహ్మకుమారి ప్రతినిధుల రాఖీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) సందర్భంగా ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌కు బ్రహ్మకుమారీస్ స్పిరిచ్యువల్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి సోదరీమణులు జయ, పద్మజ, రాధ సీఎంకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బ్రహ్మకుమారి ప్రతినిధులు రాజస్థాన్‌లోని మౌంట్ అబూలో ఉన్న బ్రహ్మకుమారి ప్రధాన కార్యాలయంలో సెప్టెంబరులో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి సీఎంను ఆహ్వానించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఆఫీస్ హౌస్ కీపింగ్ మహిళలు కూడా రాఖీలు కట్టారు. సీఎం జగన్ ఆప్యాయంగా వారిని పలుకరించారు. సీఎం చేతికి రాఖీలు కట్టి మహిళా సిబ్బంది తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఇండియాతో మోదీకి చుక్కలే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్

విశాలాంధ్ర-గుంతకల్లు: ప్రతిపక్షాల ఇండియా కూటమితో మోదీ సర్కారును గద్దె దింపుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ చెప్పారు. ఇండియా కూటమి లక్ష్యం నెరవేరాలని కాంక్షిస్తూ సీపీఐ, కాంగ్రెస్ నేతలు గురువారం సీపీఐ కార్యాలయం వద్ద పావురాలను ఎగురవేశారు. డి.జగదీశ్ సహా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, నియోజకవర్గం కార్యదర్శి వీరభద్ర స్వామి, కాంగ్రెస్ పార్టీ నియోజవర్గం ఇన్‌చార్జి ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం జగదీశ్ మాట్లాడుతూ మోదీని గద్దె దించడానికి ఇండియా కూటమి శక్తివంచన లేకుండా పోరాడుతుందని చెప్పారు. మోదీ సర్కారు పతనం ప్రారంభ మైందన్నారు. ఎన్నికల్లో లబ్ధికోసం కేంద్రం కొత్త ఎత్తులతో ముందుకు వస్తోందని, అందులో భాగంగా గ్యాస్ బండ ధరను రూ.200 తగ్గించిందని జగదీశ్ విమర్శించారు. గ్యాస్ సిలిండర్ ధర రూ.400 నుంచి రూ.1200కు పెంచిన ఘనత ప్రధాని మోదీదేనన్నారు. ధరలు కొండంత పెంచి గోరంత తగ్గించి గొప్పలు చెప్పుకుంటున్నారని మండి పడ్డారు. టోల్ ప్లాజా రుసుం భారీగా పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. మోదీ పాలనతో ప్రజల జీవన పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. మత రాజకీయాలతో లౌకిక వ్యవస్థకు భంగం కలిగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాలపై పెత్తనం పెరిగిందని, బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు మోదీ అంబాసిడర్‌గా మారారని ఆరోపించారు. రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. ఏపీలోని ఇతర పార్టీలు కూడా ఇండియా కూటమిలోకి రావాలని పిలుపునిచ్చారు. సీపీఐ నియోజకవర్గం సహాయ కార్యదర్శి బి.మహేశ్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము రాయల్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ తలారి సురేశ్, ప్రజానాట్యమండలి పట్టణ కార్యదర్శి ప్రసాద్, నాయకులు మురళి, ఉమ్మర్ బాషా, ఎస్.కొట్టాల భాష, నాగేంద్ర, కాంగ్రెస్ నాయకులు చిప్స్ భాష, లక్ష్మినారాయణ, రహంతుల్లా, దీప్తి, కమల, చిరంజీవి, శీను తదితరులు పాల్గొన్నారు.

కోడికత్తి కేసులో ఐదేళ్లుగా బెయిల్ ఇవ్వకపోవడం దారుణం

నిందితుని తరపు న్యాయవాది అబ్దుల్ సలీం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కోడికత్తి కేసులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తరపు న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు చెబుతున్నవన్నీ అబద్ధాలేనని కోడికత్తి శ్రీను తరపు న్యాయవాది అబ్దుల్ సలీం ఆరోపించారు. గురువారం ఆయన అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ జగన్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వంతో ఎన్ఐఏ కుమ్మక్కు అయ్యిందన్నారు. తన క్లయింట్‌పై అసత్య ప్రచారం చేసి, అభియోగాలు మోపిందన్నారు. ఐదేళ్లుగా జైలులో ఉంచి బెయిల్ ఇవ్వడం లేదని మండిపడ్డారు. దళితుడైన తన క్లయింట్‌కు ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్ కనీసం ఇప్పటికైన కోర్టుకు రావాలని, వస్తే... అతని న్యాయవాది చెప్పినవన్నీ అబద్ధాలని నిరూపిస్తానని సలీం చాలెంజ్ చేశారు. వాస్తవానికి కోడికత్తి లభించింది తన క్లయింట్ వద్ద కాదని.. ఆ రోజు మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడి వద్ద అది లభించిందని, అందుకు తన వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. ఆనాడు ప్రతిపక్షనేతగా ఉన్న జగన్ అక్రమంగా కరణం ధర్మశ్రీ, రాజన్న దొర, కొండా రాజీవ్ గాంధీ, కృష్ణకాంత్, సుధాకర్‌ను ఎయిర్ పోర్టు వీఐపీ లాంజ్‌లోకి తీసుకువచ్చారని, వారి వద్ద ఎలాంటి పాసులు, పర్మిట్‌లు లేవని, దానికి సంబంధించిన ఆధారాలు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. తన కక్షిదారుకు ఎలాంటి క్రిమినల్ రికార్డు లేదన్నారు. ఇంత వరకు జగన్ సిట్ రికార్డులను ఎన్ఐఏకు ఎందుకు ఇవ్వలేదు... నాలుగేళ్లుగా ఆయన సీఎంగా ఉండి ఏం చేస్తున్నారని అబ్దుల్ సలీం ప్రశ్నించారు.

టీడీపీ హయాంలో ఇసుక సొమ్మంతా...

బాబు, లోకేశ్ జేబుల్లోకే

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ ప్రభుత్వంలో ఇసుక సొమ్మంతా చంద్రబాబు, లోకేశ్ జేబులోకి వెళ్లిందని, ఉచిత ఇసుక పేరుతో బ్లాక్ మార్కెట్ దందా నడిపారని రాష్ట్ర విద్యుత్, అటవీ, మైనింగ్ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. వెలగపూడి సచివాలయంలో గురువారం పీపీటీ (పవర్ పాయింట్ ప్రజెంటేషన్) ద్వారా, ఇసుక పాలసీపై పూర్తి గణాంకాలతో మీడియాతో మంత్రి సుదీర్ఘంగా మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఉచిత ఇసుక పేరుతో జరిగిన దోపిడీ, సీఎం జగన్ ప్రభుత్వంలో అత్యంత పారదర్శకంగా అమలవుతున్న ఇసుక పాలసీ, తద్వారా ప్రభుత్వానికి వస్తున్న ఆదాయాన్ని వివరించారు. ఇసుకపై బాబు, లోకేశ్ ఓవరాక్షన్ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇసుక తవ్వకాలు, అక్రమాలంటూ ఆరోపణలు చేస్తున్నారని, అనుమతులున్న ఓపెన్ రీచ్‌ల దగ్గరకు కూడా వెళ్లి సెల్ఫీలంటూ వాళ్లు హడావుడీ చేయడాన్ని అందరూ చూస్తున్నారని చెప్పారు. ఇసుక దోపిడీపై మాకు గడువిచ్చామని, 48 గంటల్లో సమాధానం చెప్పకపోతే, తదుపరి చర్యలుంటాయని వారు రంకెలేస్తున్నారని మండిపడ్డారు. అనుమతులున్న ఇసుక రీచ్‌ల దగ్గరకు పోయి టీడీపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బాబు హయాంలో 19 జీవోలతో దోపిడీకి పాల్పడ్డారని, ఇసుక గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. చంద్రబాబు హయాంలో లోకేశ్‌కు ప్రతినెలా రూ.500 కోట్ల కప్పం వచ్చేదని, ఇసుక అక్రమ తవ్వకాలపై, ఎవరైనా ఫిర్యాదు చేయాలన్నా అది ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియకుండా చేశారని మండిపడ్డారు. పారదర్శక ఇసుక పాలసీని సీఎం జగన్ తెచ్చారన్నారు. ఇసుక తవ్వకాలకు సంబంధించి అక్రమాలు ఎక్కడైనా జరిగితే, ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని స్పష్టం చేశారు. వర్షా కాలంలో కూడా ఎక్కడా ఇసుక కొరత రాకుండా అన్నిరకాల జాగ్రత్త చర్యలు చేపట్టి, ఎండా కాలంలోనే స్టాక్‌యార్డుల్లో ఇసుక నిల్వలు ఉంచేలా ఆదేశాలిచ్చామని చెప్పారు. మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ, జేపీ పవర్ వెంచర్ల కంపెనీ కాంట్రాక్టు కాలపరిమితిని మరో ఏడాదికి పొడిగించామని చెప్పారు.

ఎస్సీల సంక్షేమానికి పెద్ద పీట

- వారి అభివృద్ధికి రూ.20 వేల కోట్లు కేటాయించాం
- నిధులను పూర్తిగా వినియోగించుకోవాలి
- ప్రభుత్వ శాఖలకు మంత్రి మేరుగు నాగార్జున ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత ఏడాది కంటే 10 శాతం అధికంగా ఈ ఏడాది ఎస్సీ కాంపోనెంట్ (సబ్ ప్లాన్)లో భాగంగా ఎస్సీల సంక్షేమానికి రూ.20,005.22 కోట్లను ప్రభుత్వం కేటాయించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. ఎస్సీల అభ్యున్నతి కోసం కేటాయించిన ఈ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించాలని సీఎం జగన్ ఆదేశించిన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సబ్ ప్లాన్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన 31వ ఎస్సీ కాంపోనెంట్ నోడల్ ఏజెన్సీ సమావేశంలో మంత్రి మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రంలో కొత్త ఆలోచనలతో పరిపాలన చేస్తున్నారని, అందులో భాగంగానే ఎస్సీల సమగ్రాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నారని, దీనికి అవసరమైన నిధులను కూడా ఎక్కువ స్థాయిలో ఇస్తున్నారని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ సబ్ ప్లాన్‌కు కేటాయించిన నిధుల కంటే ఈ ఏడాది రూ.1,486.93 కోట్లు అధికంగా మంజూరు చేశారని తెలిపారు. ప్రస్తుతం ఈ నిధుల్లో రూ.9,201.93 కోట్లు జులై నెలాఖరు నాటికి వెచ్చించినట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రధానమైన 42 ప్రభుత్వ శాఖలు ఎస్సీ కాంపోనెంట్‌లో భాగంగా చేపట్టిన వివిధ పథకాలు, అందుకు ఖర్చు చేసిన నిధుల వివరాలను మంత్రి నాగార్జున సమీక్షించారు. ఎస్సీలకు రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన వాటా నిధులను ఖర్చు చేయడంలో ఎక్కువగా ప్రభుత్వ శాఖలు ముందంజలో ఉన్నాయని, అనేక శాఖలు ఎస్సీ సంక్షేమ నిధుల వినియోగాన్ని మరింత వేగవంతం చేయాల్సిన అవసరముందని సూచించారు. ఈ నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయడం ద్వారా ఎస్సీల ప్రగతికి చేయూతనివ్వాలని నాగార్జున కోరారు. ఎస్సీ కాంపోనెంట్ కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన బడ్జెట్‌ను ఆయా శాఖలు విశ్లేషించుకోవాలని, ఏదైనా పథకానికి అదనంగా బడ్జెట్ అవసరమైతే వాటికి సంబంధించిన ప్రతిపాదనలను నోడల్ ఏజెన్సీకి అందించాలని సూచించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, సాంఘిక సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి, ఇన్‌చార్జ్ కే. హర్షవర్ధన్, ఎస్సీ కార్పొరేషన్ వీసీ ఎండీ చిన్నరాముడు, ఎస్సీ గురుకులాల కార్యదర్శి ఆర్.పావనమూర్తి తో పాటుగా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దళిత జాతికి సంపూర్ణ స్వాతంత్ర్యం రాలేదు

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: దేశంలో ఇంకా కొన్ని వర్గాలకు, ముఖ్యంగా దళిత జాతికి పూర్తిగా స్వాతంత్ర్యం వచ్చినట్లుగా లేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. ఏం పెద్ద నేరం చేశాడని దళిత జాతికి చెందిన శ్రీనివాస్‌ను కోడికత్తి కేసులో 1,685 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉంచారని ఆయన ప్రశ్నించారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోడికత్తితో జగన్ భుజానికి గుచ్చితే 1,685 రోజులు రిమాండ్ లో ఉంచాలా... గొడ్డళ్లతో తల నరికి, ఛిద్రం చేసినవాళ్లు మాత్రం వెంటనే బయటకు వస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీనివాస్ దళితుడు అవ్వడంతోనే చిన్న హత్యాయత్నం కేసులో అన్ని రోజులు జైల్లో ఉంటున్నాడన్నారు. ఇదేమైనా పార్వతీపురం కుట్రా... చెంచల్ గూడ జైలు బ్రేకింగ్ కేసా... ఎన్నికైన ప్రభుత్వాన్ని పడగొట్టే కేసా... బందిపోట్లు వందల మందిని ఊచకోత కోసిన కేసా... టెర్రరిస్టులు తాజ్ హోటల్ ని భస్మీపటలం చేసిన సంఘటనా...నక్సలైట్లు అనేకమందిని పొట్టన పెట్టుకున్న కేసా అంటూ రామయ్య నిలదేశారు. దళిత వర్గానికి చెందిన పేద యువకుడు శ్రీనివాస్ ఇన్ని రోజులుగా రిమాండ్ ఖైదీగా జైల్లో వుండడంపై న్యాయవ్యవస్థ సమాధానం చెప్పాలన్నారు. అధికార పార్టీలో ఉన్న దళిత ఎమ్మెల్యేలు, మంత్రులకు శ్రీనివాస్ పడుతున్న ఇబ్బందులు, కష్టాలు కనిపించవా... వారు ఎందుకు స్పందిచరు అని ఆయన మండిపడ్డారు. శ్రీనివాస్ విషయంలో జగన్‌తో పాటు న్యాయవ్యవస్థ సమాధానం చెప్పకపోతే...దళితులకు నిజమైన స్వాతంత్ర్యం రాలేదని భావిస్తానని వర్ల రామయ్య అన్నారు.

సంపాదకీయం

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల మతలబు?

వచ్చే నెల 18 నుంచి 22 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు అవుతాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం హఠాత్తుగా ప్రకటించారు. అయితే ఈ ప్రత్యేక సమావేశాలు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారో మాత్రం ఆయన చెప్పలేదు. రేపో మాపో చెప్తారేమో తెలియదు. అన్నింటినీ ఎన్నికల ప్రయోజనాలకు వాడుకోవడంలో ఆరితేరిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ప్రత్యేక సమావేశాలను కూడా ఉపయోగించుకోవచ్చు. సార్వత్రిక ఎన్నికలు జరగడానికి ముందు నవంబర్-డిసెంబర్ నెలల్లో శీతాకాల సమావేశాలు జరగవలసిఉంది. ఈ పార్లమెంటు గడువు పూర్తయ్యేలోగా అవే ఆఖరి సమావేశాలు కావచ్చు. సెప్టెంబర్‌లో ఈ ప్రత్యేక సమావేశాలు నిర్వహించేనాటికి సెప్టెంబర్ 9-10 తేదీల్లో జి20 సమావేశాలు పూర్తి అవుతాయి. దానితోపాటు చంద్రయాన్-3 సఫలం కావడం కూడా మోదీ ఘనతేనని భక్తులు ఇదివరకే ప్రచారం మొదలు పెట్టారు. ఈ రెండు సంఘటనల గురించి పార్లమెంటు సమావేశాలలో ప్రస్తావించి తమ గొప్ప చెప్పుకోవడానికి మోదీ ప్రయత్నించే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ ప్రత్యేక సమావేశాల ఎజెండా ఏమిటో చెప్పలేదు కాని బిల్లులు ప్రతిపాదించి ఆమోదింప చేసుకునే ఆలోచన అయితే ఉన్నట్టులేదు. పార్లమెంటు నూతన భవనంలోకి మారడానికి కూడా ఈ సమావేశాలను వినియోగించుకోవచ్చు. ఈ అయిదు రోజుల్లో కొన్ని రోజులు పాత భవనంలోనూ, మరికొన్ని రోజులు కొత్త భవనంలోనూ జరుగుతాయంటున్నారు. మణిపూర్ మారణకాండలాంటి ప్రజల సమస్యలను చర్చించడానికైతే మోదీ తప్పించుకు తిరుగుతారు కానీ స్వోత్కర్షలకు ఎన్నడూ వెనుకాడరు. పార్లమెంటు నూతన భవన ప్రారంభానికి ప్రతిపక్షాలు హాజరు కాలేదు. మోదీ ఒక్కరే "గృహప్రవేశం" చేసేశారు. ఇప్పుడు ప్రత్యేక పార్లమెంటు సమావేశాలపేర నూతన పార్లమెంటు భవన ప్రవేశానికి మార్గం సుగమమం చేసుకోవాలనుకుంటున్నారు. కేవలం కొత్త పార్లమెంటు భవనంలోకి ప్రవేశించడానికే అయితే ప్రారంభోత్సవం ఎటూ అయిందనిపించారు కనక హడావుడిగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయవలసిన పనేలేదు. అంటే జి20 శిఖరాగ్రసభ ఎంత అద్భుతంగా నిర్వహించామో, చంద్రయాన్-3 ఎలా విజయవంతమైందో పార్లమెంటు వేదిక మీంచి ప్రకటించి దేశంలోనూ, అంతర్జాతీయంగాను తన ఖ్యాతిని దశదిశలా వ్యాపింప చేయడం మోదీ ఉద్దేశం కావచ్చు. లేకపోతే ఎజెండా ప్రకటించకుండా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయవలసిన అవసరమేలేదు. 75వ స్వాతంత్ర్య దినోత్సవాలను చాటి చెప్పడానికి కూడా ఈ సమావేశాలను ఉపయోగించుకోవచ్చు. భారత్ అభివృద్ధి చెందిన దేశం అని ప్రకటించినా ఆశ్చర్య పడక్కర్లేదు. మోదీ దృష్టిలో అభివృద్ధికి నిర్వచనం వేరు కనక పెరుగుతున్న పేదరికం, ధరలు, నిరుద్యోగం మొదలైనవి ఎన్ని ఉన్నా అభివృద్ధి సాధించామని చేప్తే మోదీని అడ్డుకునే వారు ఎవరు. అడ్డుకున్నా ఆయన ఎవరిమాట వినిపించుకుంటారు గనక! కశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తిని ఎప్పుడు పునరుద్ధరిస్తారు అని సుప్రీంకోర్టు ఇటీవలే నిలదీసింది. దానికి సంబంధించిన అధికారిక ప్రకటన ప్రత్యేక సమావేశాల వేదికగా వెలువడుతుందన్న భరోసా అయితేలేదు. శీతాకాల సమావేశాలు సాధారణంగా అయితే నవంబర్-డిసెంబర్‌లో జరగాలి. ఇప్పుడు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు కనక శీతాకాలసమావేశాలు జాప్యం అయ్యే అవకాశాలూ లేకపోలేదు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, తెలంగాణ రాష్ట్రాల శాసనసభల ఎన్నికల తరవాత శీతాకాల సమావేశాలు నిర్వహించే ఆలోచన కూడా ఉండి ఉండొచ్చు. ఆలోగా చంద్రయాన్, జి20 సమావేశాల గురించి గొప్పలు చెప్పుకోవాలంటే ప్రత్యేక సమావేశాలు నిర్వహించడమే మేలని ప్రభుత్వం భావించినట్టుంది. గత సంవత్సరం కూడా గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలు జరిగిన తరవాత డిసెంబర్ ఏడు నుంచి 23 దాకా శీతాకాల సమావేశాలు నిర్వహించారు. జి20 దేశాల పార్లమెంట్ల స్పీకర్ల సమావేశం (పి20) కూడా జరగనుంది కనక పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు దానికి తగిన నేపథ్యం సమకూర్చినట్టు కూడా ఉంటుందని అనుకొని ఉండొచ్చు. పి20 సమావేశానికి హాజరవుతామని ఇప్పటికే 30 దేశాల స్పీకర్లు తెలియజేశారు. అయితే లోకసభ, రాజ్యసభ కూడా ప్రత్యేకంగా సమావేశం అవుతాయి కాని ఉభయ సభల సంయుక్త సమావేశం నిర్వహించే సూచనలు ఉన్నట్టు లేదు. ఫిబ్రవరి మే మధ్యలో బడ్జెట్ సమావేశాలు, జులై నుంచి సెప్టెంబర్ మధ్య వర్షాకాల సమావేశాలు, నవంబర్-డిసెంబర్ నెలల్లో శీతాకాల సమావేశాలు నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఇటీవలి కాలంలో పార్లమెంటు సమావేశాలు నిర్వహించే వ్యవధి గణనీయంగా తగ్గిపోతోంది. రెండు దశాబ్దాల కిందటి దాకా ఏడాదిలో కనీసం 120 రోజులపాటు పార్లమెంటు సమావేశాలు జరిగేవి. ఇప్పుడు ఆ వ్యవధి 70 రోజులకు తగ్గిపోయింది. పార్లమెంటు సమావేశాలు ఎంతకాలం నిర్వహిస్తున్నారు అన్న దానికన్నా నిర్వహించే కొద్ది రోజులైనా సవ్యంగా జరుగుతున్నాయా అంటే అదీలేదు. ఉదాహరణకు గత ఆగస్టు 12 న ముగిసిన వర్షాకాల సమావేశాలు జులై 20న ప్రారంభమైనాయి. ఎక్కువ రోజులు మణిపూర్ మారణకాండపై ప్రధానమంత్రి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టినందువల్ల సభ సవ్యంగా జరిగిందే తక్కువ. అయినా ప్రభుత్వం ఆ రణగొణ ధ్వనుల మధ్య 23 బిల్లులను మమ అనిపించింది. బిల్లుల మీద చర్చ జరిగే సమయం మరీ కుంచించుకుపోతోంది. ఉదాహరణకు లోకసభ వర్షాకాల సమావేశంలో 43శాతం, రాజ్యసభ 55 శాతం మాత్రమే సభా కార్యక్రమాలు సాగాయి. లోకసభ 17 రోజులపాటు సమావేశం అయింది. అంటే మొత్తం 44 గంటల 15 నిముషాలు జరిగింది. ప్రతిపక్షాలు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం మీద మాత్రం మూడు రోజుల వ్యవధిలో 19 గంటల 59 నిముషాలు చర్చ జరిగింది. ఇందులో రెండు గంటలు అమిత్ షా, మరో రెండు గంటలు మోదీ ప్రసంగాలతోనే సరిపోయింది. కానీ ఆమోదించిన బిల్లుల మీద జరిగిన చర్చ మాత్రం అత్యంత స్వల్పం. ఉదాహరణకు అటవీ సంరక్షక (సవరణ) బిల్లు మీద లోకసభలో 38 నిముషాలు, రాజ్యసభలో 41 నిముషాలు మాత్రమే చర్చ జరిగింది. జనన మరణాల సవరణ బిల్లు మీద లోకసభలో 23 నిముషాలు, రాజ్యసభలో 35 నిముషాలు, గనులు-ఖనిజాల బిల్లు మీద లోకసభలో 19 నిముషాలు, రాజ్యసభలో 34 నిముషాలు మాత్రమే చర్చ జరిగింది. మూడునిముషాలు, రెండు నిముషాల్లో ఆమోదించిన బిల్లులూ ఉన్నాయి. సెలెక్ట్ కమిటీలకు బిల్లులను పంపడం చాలా అరుదై పోయింది. ఏ బిల్లు మీద అయినా కూలంకషమైన చర్చ జరగాలి. హడావుడిగా, మొక్కుబడిగా ఆమోదించిన బిల్లులలో లోపాలు మిగిలిపోవచ్చు. బిల్లు సమగ్రంగా లేకపోతే ఆ తరవాత కోర్టులకెక్కే సందర్భాలు పెరుగుతూ ఉంటాయి. అసమగ్రమైన చర్చతో శాసనాలు ఆమోదించడం అంటే ప్రజానుకూలమైన చట్టాలు రూపొందడానికి పనిగట్టుకుని విఘాతం కలిగించడమే. ఈ అంశాలను పట్టించుకోకుండా ప్రత్యేక సమావేశాల వల్ల ఒరిగేదేమీ ఉండదు. స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా 1997లో, జి.ఎస్.టి.బిల్లు ఆమోదించడానికి 2015లో పార్లమెంటు సమావేశాలు జరిగాయి. వచ్చే నెల జరిగేవి మూడవవి కావొచ్చు.

బలపడుతున్న బ్రిక్స్

మక్కెన సుబ్బారావు

గతవారం దక్షిణాఫ్రికాలోని జొహాన్స్ బర్గ్‌లో రెండురోజులపాటు జరిగిన ఐదుదేశాల సహకార సంస్థ బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా,ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా ఈ దేశాలు పేరులోని మొదటి అక్షరాల కూర్పు) అగ్రనాయక సమావేశం నుండి రెండు అంశాలను గ్రహించవచ్చు. ఒకటి, ఐదుదేశాల బ్రిక్స్‌లో మరో ఆరు దేశాలను సభ్యులుగా చేర్చుకుని 11దేశాల గ్రూపుగా ఉంటుంది. రెండు, బ్రిక్స్ ఎజెండాలో భాగంకాకపోయినా ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్ర మోదీ మధ్య జరిగిన అనధికారిక చర్చలు ప్రతికూలంగాఉన్నా ఇరుగుపొరుగుదేశాల మధ్య సంబంధాలు బ్రిక్స్ పనితీరుపై ప్రభావం చూపుతాయి. 2022 ఏప్రిల్‌లో పశ్చి సరిహద్దులో లడ్డాక్ రీజియన్‌లో గల్వాన్ ప్రాంతంలో ఇరుదేశాల గస్తీ సైనికుల మధ్య తీవ్రఘర్షణ జరిగింది. 20మంది భారత జవాన్‌లు మృతిచెందారు. దీంతో ఇరు దేశాలమధ్య సుహృద్భావ సంబంధాలు ఘనీభవించాయి. ఆ మంచు కరగాలంటే అగ్రనాయకుల సమావేశం, చర్చలు తప్పనిసరి అవసరం. జి-20, షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓలు) సమావేశాల్లో నాయకులిరువురు కలిసినా అది మర్యాదపూర్వక పలకరింపులకే పరిమితం. జొహాన్స్‌బర్గ్‌లో ఒక్కఅడుగు ముందుకుపడింది. బ్రిక్స్‌కు సంబంధించినంతవరకు, బహుళపక్ష, బహుళ ధృవ ప్రపంచార్థిక వ్యవస్థను ముందుకుగొనిపోవటం, పరస్పర సహకారం, డాలర్ ఆధిపత్యం తగించేందుకు ఇతర కరెన్సీల్లో వ్యాపారాభివృద్ధి అవకాశాలను అన్వేషించటం, మరింత బలమైన ప్రత్యామ్నాయ సంస్థగా వృద్ధిచెందేందుకు కృషి ప్రధాన ఎజెండా. అంటే అమెరికా కోరుకుంటున్న ఏకధృవ ప్రపంచానికి దాని ఆధిపత్యంలోగల బ్రిక్స్ వ్యతిరేకం, అమెరికా, పశ్చిమదేశాల నయావలసవాద దోపిడీకి వ్యతిరేకంగా పేద దేశాలకు అండగా ఉండి, వాటి అభివృద్ధికి చేయూత ఇవ్వాలి. బ్రిక్స్ ఈ పరిభాషలో మాట్లాడకపోవచ్చు. దాని దౌత్య పరిభాషవెనుక దాగిఉన్న గూఢార్థం అదే. అంతర్జాతీయ వేదికలపై భూతాపం, వాతావరణ కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ, పేదరికం నిర్మూలనకు పేదదేశాలకు సహాయం, దురాక్రమణ, యుద్ధాలను వ్యతిరేకించటం, ఐరాసకు పటిష్టం చేయటం తదితర అంశాలపై కలిసికట్టు అభిప్రాయాలతో దుందుడుకు శక్తులను నిరోధించేందుకు కృషిచేస్తుంది. ఇటువంటి విశాలదృక్పథం కారణంగానే బ్రిక్స్‌లో సభ్యత్వం కోరుతున్న దేశాలసంఖ్య 40కి చేరుకుంది. అమెరికా ఏకధృవ ప్రపంచ ఆకాంక్షలకు వ్యతిరేకంగా తొలుత బ్రిక్స్ నాలుగుదేశాలతో ఆవిర్భవించింది. 2010లో దక్షిణాఫ్రికాను చేర్చుకున్నారు. దాంతో బ్రిక్స్‌కు 'ఎస్' కలిసి 'బ్రిక్స్' అయింది. ఇప్పుడు మరో ఆరుదేశాలను ఈ క్లబ్‌లో చేర్చుకున్నారు. భూగోళంలోని దక్షిణప్రాంత పేదదేశాలకు ఆకర్షణీయంగా, ఆశాజనకంగా కనిపిస్తున్న ఈ క్లబ్‌లో చేరటానికి 40కిపైగా దేశాలు ఆసక్తిచూపాయి. బ్రిక్స్ వ్యవస్థాపకులు 22దేశాల నుండి దరఖాస్తులు స్వీకరించారు. అయితే ఏకాభిప్రాయం ప్రకారం కొత్త సభ్యుల్ని చేర్చుకోవాలన్న అభిప్రాయాలకనుగుణంగా ప్రస్తుతం ఆరు దేశాలకు సభ్యత్వం ఇచ్చారు. వాటి ఎంపికకు భౌగోళికంగా ఎంతో ప్రాధాన్యం ఉంది. పశ్చిమాసియా నుంచి ఈజిప్టు, ఇరాన్, సౌదీ అరేబియా, యుఎఇ, ఆఫ్రికా నుంచి ఇథియోపియా, దక్షిణ అమెరికా నుంచి అర్జెంటీనా భాగస్వామ్యమైనాయి. దీంతో బ్రిక్స్ రాజకీయంగా కూడా బలపడింది. విరుద్ధశక్తులైన ఇరాన్, సౌదీ అరేబియాల మధ్య, అలాగే సౌదీ, యుఎఇ మధ్య ఈ సంవత్సరారంభంలో చైనా సాధించిన శాంతిఒప్పందం ఇందుకు దోహదంచేసింది. ఉక్రెయిన్- రష్యా మధ్యయుద్ధం దృష్ట్యా రష్యాను ఏకాకినిచేయటానికి అమెరికా, యూరప్‌దేశాలు యత్నిస్తున్న నేపథ్యంలో బ్రిక్స్ విస్తరణ ప్రాధాన్యం ఉంది. ప్రపంచ క్రిమినల్ కోర్టుపై ఒత్తిడితెచ్చి రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై పశ్చిమదేశాల అరెస్టువారెంటు తెచ్చాయి. అందువల్లనే పుతిన్ బ్రిక్స్ సభకు రాలేదు. ఢిల్లీలోజరగనున్న జి-20 సమావేశానికి రావటంలేదు. ఆతిథ్య దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామ్‌ఫోసా, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వ, భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా విదేశాంగమంత్రి సెర్గి లవరోవ్ పాల్గొన్న ఆ సభకు వివిధ దేశాల ప్రతినిధులు హాజరైనారు. జి-7కు పోటీగా బ్రిక్స్‌ను తీర్చిదిద్దాలన్నది రష్యా ప్రయత్నం. డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీ వృద్ధి చేయటంపై ఇతర బ్రిక్స్ దేశాలు కనబరచిన ఉత్సాహాన్ని భారత్ ప్రదర్శించలేదట. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాపై అమెరికా ఆర్థిక ఆంక్షలు విధించగా రష్యా సహా కొన్ని దేశాలతో భారత్ స్థానిక కరెన్సీతో వాణిజ్యం కొనసాగించటం గుర్తుచేసుకోదగింది. బ్రిక్స్ అతిపెద్ద వాణిజ్య బ్లాకు. ఆ దేశాల మధ్య ఏకీభావం కుదరితే డాలర్ ఆధిపత్యానికి ప్రత్యామ్నాయం కనుగొనటం కష్టంకాదు. కావలసింది ఈ దేశాల మధ్య స్నేహం, సఖ్యత, సుహృద్భావం, ఏకీభావం. ముఖ్యంగా చైనా, భారత్ మైత్రి కీలకం. చైనాతో ఉన్నతస్థాయి చర్చలద్వారా సరిహద్దులో ఉద్రిక్తోపశమనాన్ని భారత్ కోరుకుంటోంది. దక్షిణాఫ్రికాలో చైనా చొరవతో చర్చలుజరిగినట్లు బైట ప్రపంచానికి తెలిస్తే, తమదృఢమైన వైఖరితో చైనా దిగి వచ్చిందని ప్రచారం చేసుకుని రాజకీయంగా లబ్ధి పొందాలనే మోదీ ప్రభుత్వ ఆకాంక్షకు విఘాతం కాదా! ఎవరిచొరవతో చర్చలు జరిగాయనే దానికన్నా వారు ఏమిచెప్పారన్నది ప్రధానం కాదా? 2022 నవంబరులో బాలీలో జి-20 సమావేశం సందర్భంగా జిన్‌పింగ్ -మోదీ కలుసుకుని సరిహద్దు ఉద్రిక్తతల సడలింపుపై సంభాషించారు. ఆ విషయం వెల్లడించటానికి భారత విదేశాంగశాఖకు 8మాసాలుపట్టింది. బ్రిక్స్‌అగ్రనాయక సమావేశం సందర్భంలో జిన్‌పింగ్, మోదీ కలుసుకుని చర్చలు జరిపారు. ఆగస్టు 23న చర్చలు జరిగినేత ఆమరుసటి రోజుగాని విదేశాంగ కార్యదర్శి వినయ్‌క్వాత్రా అవి ఇష్టాగోష్ఠి చర్చలంటూ మీడియాకు వెల్లడించలేదు. భారత్-చైనా మధ్య సాధారణ సంబంధాలు నెలకొల్పుకుని సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, సామరస్యం పాటించటం, వాస్తవాధీన రేఖను గౌరవించటం తప్పనిసరి అని నాయకులిరువురు నొక్కిచెప్పారని క్వాత్రా వెల్లడించారు. మాటలను ఆచరణలోకి తేవటం ఇరుదేశాలబాధ్యత. "త్వరితగతిన సైన్యాల ఉపసంహరణకు, ఉద్రిక్తత సడలింపునకు ప్రయత్నాలను ముమ్మరంచేయాలని తమసంబంధిత అధికారులను ఆదేశించాలని ఉభయులూ నిర్ణయించినట్లు కూడా క్వాత్రా తెలిపారు. అయితే చైనా విదేశాంగశాఖ ప్రకటనలో అలాంటి ప్రస్తావనలు లేకపోవటం గమనార్హం. ఇరుపక్షాల సంబంధాల స్థూల ప్రయోజనాన్ని మనసులో ఉంచుకోవాలని జిన్‌పింగ్ చెప్పినట్లు ఆ ప్రకటన తెలిపింది. ఆంతటితోఆగకుండా, భారతదేశ అభ్యర్థనపై తాముచర్చలు జరిపినట్లు పేర్కొన్నది. దీంతో కంగుతిన్న భారత ప్రభుత్వాధికారులు, మరింత నిర్మాణాత్మక ద్వైపాక్షిక సంభాషణలను చైనా కోరిందని, ఆ అభ్యర్థనను భారత్ నిరాకరించిందని ఢిల్లీలో విలేకరులకుచెప్పారు. సెప్టెంబరు రెండవ వారంలో ఢిల్లీలో జరిగే జి-20 సమావేశాలకు కూడా చైనా నాయకుడు వస్తారు. ఆ సందర్భంలో మోదీ మరింత సావకాశంగా లోతుగా చర్చించవచ్చుకాని మాదే పై చేయి అనిపించుకోవాలనే ఎత్తుగడ సత్ఫలితమివ్వదు.

సీనియరు జర్నలిస్టు

తెలుగుకు తెగులు

పోయాయి పోయాయి ఆహ్లాదం, ఆనందం ఇపుడు పట్టిందోయ్ తెలుగుకు తెగులు. ఏంటి బావ కొత్త నినాదం ఎత్తుకున్నావు. ఇపుడేమయింది తెలుగుకు. రెండు రోజుల క్రితమేగా గిడుగు వెంకట రామమూర్తి జన్మదినం జరుపుకున్నాం. అదే నేననేది ఆ సందర్భంగా మాట్లాడిన రాజకీయ నాయకులు తెలుగు మాట్లాడే తీరు వేరు. అసలు గ్రాంథికం సామాన్యులకు అర్థం కావడం లేదనేగా గిడుగు ఎంతో ప్రయత్నించి తనతోపాటు కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావును కూడ కూడగట్టుకొని సనాతన వాదుల్ని ఎదిరించి గ్రాంథికం సామాన్యులకు అర్థంకాదని తెలుగుకు ప్రాణం పోశాడు. అవును ఇపుడేమైందయ్యా. ఎమైందయ్యా అని సాగదీసి నిదానంగా మాటాడతావేంటి. అసలు యిపుడు శ్రీశ్రీ లాంటి మహా కవులు కూడ గ్రాంథికం వదలి ప్రజలకోసం అచ్చ తెలుగులో రాసి ప్రజా కవులుగా మారారు. ఇపుడేమో రోజూ మీడియా ద్వారా రాజకీయ నాయకులు కొత్త తెలుగు మాట్లాడుతుంటె చెవులు మూసుకోవలసి వస్తోంది. మీడియాలో డిబేట్ జరిపితే చొక్కాలు మడిచి నీ సంగతి తేలుస్తా, దమ్ముందా, బయటకు రారా, వెధవ, కుక్క సన్నాసి యింకా ఉన్నాయిగాని చెప్పలేను బావ. నిజమె అక్కడ కర్రలు దొరికితె అక్కడే తన్నుకుంటారనుకో. డిబేట్ ఏర్పాటు చేసిన వారె కర్రలు కూడ సప్లయ్ చేస్తె వారు తన్నుకుంటె పత్రికల వారికి మంచి వార్త దొరికినట్లె అనుకో. అసలు బయటకొచ్చాక ఏమిటి నాయకా ఆ మాటలు అని అడిగితే, విన్నావా మిత్రమా నీహెకడినేగా అచ్చ తెనుంగులో మాట్లాడింది. ఇక రెండో ప్రశ్న వేయకుండ నోరు మూసుకుని అయ్యా గిడుగూ నిన్ను వదిలి మా రాజకీయులు కొత్త తెలుగు ఏర్పాటు చేసుకున్నారు. మీరు బాధపడకండి. గిడుగు వారు అనుకున్నా. అదెందుకు మాకు యస్.యస్.యల్.సి చదివే రోజుల్లో నెమ్మాని



వెంకటశాస్త్రిగారని తెలుగు మాస్టారుండేవారు.

ఆ రోజుల్లో తెలుగు పద్యాలు కంఠస్థంచేసి అప్పచెప్పాలి. నాకు కొంచెం సంగీత జ్ఞానం ఉండటంతో రాగయుక్తంగా అప్పజెప్పేవాడిని. దాంతో ఆయన నన్ను వెంట తీసుకెళ్లేవాడు. 20 సంవత్సరాల తరువాత విజయవాడలో కనబడి యింటికి తీసుకెళ్లాడు. వాలుకుర్చీలో కూర్చుని ఓరి కృష్ణా, ఆ రోజుల్లో నువు పాడిన బాల రసాల సార నవపల్లవ కోయిల కావ్య కన్యకనే ఆ పద్యం ఒకసారి పాడమని అడిగారు. పాడాను. ఇంతలో ఆయన కొడుకు వచ్చి డాడ్-నేను కూడ తెనుంగులో కత రాస్తా అనగానే మాస్టారు చెవులో దూది పెట్టుకున్నారు. గత మూడురోజులుగ కష్టపడి తెనుంగు సభలకు వెళ్లి వచ్చా. అందుకే నేను కూడ కత రాసానంటుంటే నీకెందుకు కోపం అనగానె నువు తొందరగా అమెరికా పో. బతికుంటె ఆ గిడుగువారు ఉరి వేసుకునేవారు. పాపం ఆ అబ్బాయి ఏం చేస్తాడు. ఇక్కడున్న వారు మాత్రం మంచి తెలుగు మాట్లాడుతున్నారంటావా. నిజమేలే అలా మారిపోయింది సమాజం. అవును ఆంగ్లేయుల పాలనలో మన సంపాదన దోచుకుని తరలిస్తూ మనల్ని పశువుల కంటె హీనంగా చూస్తూ తెలుగు అధికారులతోనె మనల్ని కాల్చి చంపించారు. అపుడు ప్రజలందర్ని కూడగట్టి వారిలో చైతన్యం తేవడానికి తెలుగులో మాసపత్రికల్లో సామాన్యునికి అర్థమయ్యేలా వ్యాసాలు రాశారు. అందుకె గ్రాంథికాన్ని వదిలి తెలుగులో రాయడానికి గురజాడ, వీరేశలింగం గిడుగుతో చేతులు కలిపారు. అటువంటి తెలుగును యిపుడు ఖూని చేస్తున్నాం గద అని బాధపడుతున్నా. నిజమె బావ 1960 ప్రాంతంలో నేను ఆర్.వి.ఆర్ మద్రాసు వెళ్లి కొడవటిగంటి కుటుంబరావును కలిశాం. అపుడాయనకు ఇంటరు ఫిజిక్సును ఇంగ్లీషు నుండి తెలుగులో తర్జుమా చేసేపని అప్పచెప్పారు. ఇంటరు తెలుగు మీడియం ప్రవేశపెట్టడానికని ఆయనకు తెలుగులో సరైన పదాలు దొరకక చాలా శ్రమపడ్డారు. అటువంటి మహనీయులవల్ల వచ్చిన తెలుగును ప్రస్తుతం నాశనం చేస్తుంటె బాధగా ఉంది. గిడుగు మనసు ఎంత క్షోభిస్తుందోనని. నిజమె. ఏదిఏమైనా ఈ అరాచకాన్ని ఆపి మీడియాను కాపాడాలి. అశ్లీల పదాలు వాడకుండ అచ్చ తెలుగు మాత్రమె చర్చలలో మాట్లాడే విధంగా తగు చర్యలు ప్రభుత్వం తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

సెల్: 9885569394

25 శాతం ప్రజలకు నీటి కొరత



నీరే ప్రాణాధారం. భూగోళంపై 70 శాతం వరకు జలావరణమే ఉన్నది. భూగ్రహంపై ఉన్న నీటిలో 2-3 శాతం వరకు మాత్రమే మానవ వినియోగయోగ్యతను కలిగిఉన్నది. ధరణిపై జలచక్రం దెబ్బతింటున్నది. నీటికొరత విశ్వ మానవాళిని భయపెడుతున్నది. ప్రపంచ మానవాళి అతివృష్టి, అనావృష్టి విపత్తులతో సతమత మవుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా మానవాళి తీవ్రమైన వాతావరణ ప్రతికూల మార్పుల దెబ్బకు విలవిల్లాడుతున్నారు. ఓ వైపు అకాలవర్ష వడగళ్లు, తీవ్రమైన వరదలు, మరో వైపు తీవ్ర వడగాలులు, కరువుకాటకాలు చుట్టు ముడుతున్నాయి. వరల్డ్ రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్ (డబ్ల్యూఆర్‌ఐ) రూపొందించిన "ఆక్వాడక్ట్ వాటర్ రిస్క్ అట్లాస్" గణాంకాల ప్రకారం ప్రపంచంలో 25 శాతం జనాభా కలిగిన 25 దేశాల్లో అతి తీవ్రమైన నీటిఒత్తిడి (ఎక్స్‌ట్రీమ్లీ హై వాటర్ స్ట్రెస్) రానుందని అంచనా వేసింది. రానున్న రోజుల్లో 50శాతం ప్రపంచ జనాభా, దాదాపు 4 బిలియన్లు, ప్రతిఏట కనీసం ఒక మాసమైన అత్యధిక నీటి కొరతను అనుభవిస్తున్నారు. తీవ్ర నీటిఒత్తిడి సంక్షోభంతో సాధారణ జీవితాలు, ఉద్యోగ ఉపాధులు, ఆహార లభ్యత (వ్యవసాయ ఉత్పత్తులు), శక్తి భద్రత లాంటి ప్రతికూలతలు ఎదురుకానున్నట్లు హెచ్చరికలు చేస్తున్నారు. పంటలు, జంతుజాతి పరిరక్షణలు, విద్యుదుత్పత్తి, మానవాళి ఆరోగ్యరక్షణ, సమానత్వ సమాజ స్థాపన, పర్యావరణ సమతుల్యత లాంటివి నీటి లభ్యత మీద మాత్రమే ఆధారపడి ఉంటాయి. నీటి కొరతను తగ్గించడానికి అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికయుక్తంగా నియంత్రించడం, వాడుకోవడం, భద్రపరుచుకోవడం, పొదుపుగా వాడుకోవడం, వృధాను అరికట్టడం లాంటివి చేపట్టాలి. భూమండలంపై అందుబాటులోఉన్న నీటికన్న వినియోగం పెరుగుతున్నది. 1960లో నీటి వినియోగంతో పోల్చితే రెట్టింపు నీటి వినియోగం పెరిగింది. నీటి నిల్వల మౌళిక వసతులకు పెట్టుబడులు తగ్గడం, సుస్థిరాభివృద్ధి కొరవడిన పాలసీల అమలు, వాతావరణంలో వస్తున్న ప్రతికూల మార్పులు లాంటి అంశాలు నీటి ఎద్దడిని విపరీతంగా ప్రభావితం చేస్తున్నాయి. లభ్యమైన నీటిలో 80 శాతం వాడితే 'అతి తీవ్ర నీటి కొరత ఎక్స్‌ట్రీమ్ వాటర్ స్ట్రెస్) అని, 40 శాతం వరకు వినియోగిస్తే 'అధిక నీటి కొరత (హై వాటర్ స్ట్రెస్) అని నిర్ణయిస్తారు. ప్రపంచవ్యాప్తంగా 25 దేశాల్లో అందుబాటులో ఉన్న నీటిలో వినియోగం 80 శాతం కన్న అధికంగా ఉంది. నీటి కొరత కలిగిన దేశాల జాబితాలో యూకె, ఇండియా, ఇరాన్, మెక్సికో, సౌదీ అరేబియా, చిలీ, శాన్‌మెరినో, బెల్జియం, గ్రీస్ దక్షిణ ఆఫ్రికాలు ముందున్నాయి. వీటికి తోడుగా అల్పాదాయ లేదా మధ్యాదాయ దేశాలైన బెహరెయిన్, సైప్రస్, కువైట్, లెబనాన్, ఓమన్, ఖతార్ లాంటి దేశాల్లో గృహ అవసరాలు, వ్యవసాయం, పరిశ్రమల వాడకానికి నీరు అధికం కావడంతో ప్రపంచ దేశాలు తీవ్ర నీటి కొరత అంచున విలవిల్లాడుతున్నాయి. మిడిల్ ఈస్ట్, నార్త్ ఆఫ్రికా దేశాల్లో 83 శాతం జనాభా, దక్షిణ ఆసియా దేశాల్లో 74 శాతం జనాభా నీటి కొరత సమస్యతో బాధ పడుతున్నారు. 2050 నాటికి నీటి డిమాండ్ 25 శాతం వరకు పెరగవచ్చని, దీనితో అదనంగా ఒక బిలియన్ జనాభా నీటి కొరత వలలో పడనుందని అంచనా. ఈ ప్రాంత దేశాల్లో రానున్న ఏండ్లలో 100 శాతం జనాభా నీటి తీవ్ర కొరత కోరల్లో చిక్కనున్నారనే కఠిన వాస్తవం భయాన్ని కలిగిస్తున్నది. నీటి కొరత హద్దులు దాటితే ఆయా దేశాల్లో సామాజిక, రాజకీయ అశాంతి ప్రజా జ్వాలలు ఎగిసి పడతాయని కూడా గత ఇరాన్ చరిత్ర హెచ్చరిస్తున్నది. ఆఫ్రికన్ దేశాల్లో నీటి విచక్షణారహిత వాడకం, నీటి నియంత్రణలో లోపాల వల్ల నీటి ఒత్తిడి కబలించనుందని హెచ్చరిస్తున్నారు. తీవ్ర నీటి కొరత కలిగిన దేశాల్లో ఆహార భద్రత కొరవడుతుంది. 2010లో నీటి కొరత వల్ల జిడిపీలో 24 శాతం, దాదాపు 15 ట్రిలియన్ డాలర్ల నష్టం జరిగిందని, 2050 నాటికి జిడిపీలో 31 శాతం, దాదాపు 70 ట్రిలియన్ డాలర్ల నష్టం నీటి కొరత వల్ల జరగవచ్చని అంచనా. వేశారు. ఆహార ధాన్యాలు అధికంగా అవసరమవుతాయి

ఆహార ధరలు పైపైకి...!

నంటూ బెనర్జీ

దేశంలో ఆహార వస్తువుల ధరలు రోజురోజుకూ పైపైకి వెళుతున్నాయి. ఇటీవల టమోట, మిర్చి తాజాగా ఉల్లిపాయలతో సహా బియ్యం, పప్పుల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పెరుగుతున్నాయి. ఈ అంశాన్ని మనదేశంలో ప్రధానమీడియా పెద్దగా పట్టించుకోకపోయినా అంతర్జాతీయ మీడియా మాత్రం వివిధదేశాల ప్రజలకు తెలియజేస్తోంది. బీజేపీ సహా ప్రతిష్టాత్మకమైన అన్ని అంతర్జాతీయ ఛానల్స్ దేశంలోని నిత్యావసరాల ధరల పెరుగుదలను ప్రముఖంగానే తెలియజేసింది. అలాగే ఆహారద్రవ్యోల్బణం పెరుగుతున్న విషయాన్ని కూడా అంతర్జాతీయ మీడియా వివరంగా తెలిపింది. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ఆర్‌బీఐ నిర్వహణ విధానం అంతగా పనిచేయలేదు. రుణాలపై వడ్డీరేటును పెంచడంద్వారా ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలని అలాగే రుణ నియమ, నిబంధనలను మరింత కఠినం చేయాలని కూడా ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అయితే ఆర్‌బీఐ ద్రవ్యవిధాన నిర్ణయ కమిటీ రెపోరేటును మార్చకుండా 6.5శాతం వద్దనే మూడవసారి కూడా కొనసాగిస్తున్నది. ఆహార ద్రవ్యోల్బణం రేటు ఎక్కువగా ఉన్న స్థితిలో సామాన్యుడికి ఆకలి తీర్చేందుకుగాను బ్యాంకుల నుండి రుణాలు తీసుకునేవారికి వెసులుబాటు కల్పించినట్లు ఆర్‌బీఐ తెలిపింది. ప్రస్తుతం ఉన్న వినిమయ ధరలు ద్రవ్యోల్బణం, తాజా ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్‌బీఐ గవర్నర్ అంచనా వాస్తవంకంటే యథాలాపంగా ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఆహార వస్తువులధరల విషయంలో వేసవి తర్వాత ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పండే పంటలు ప్రధానపాత్ర వహిస్తాయి. ఈ సీజన్‌లో రుతుపవనాల కారణంగా కురిసిన వర్షాలు అన్నిప్రాంతాలలో ఒకే మాదిరిగాలేవు. జాతీయస్థాయిలో సగటు కంటే తక్కువ వర్షాలు ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌లో వరిపంట వర్షాలు సక్రమంగాలేక అనేక జిల్లాలలో తక్కువగా నాట్లు వేశారు. ఈ రాష్ట్రంలో అన్నిప్రాంతాలకంటే ఎక్కువగా వరిపంట పండుతుంది. 2024 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికం (జులై-సెప్టెంబరు)లో ద్రవ్యోల్బణం గణనీయంగా పెరుగుతుందని, ఇందుకు కూరగాయల ధరలు పెరగడమేనని అంచనా వేసారు. వీటి ధర పెరుగుదల తక్కువకాలమే ఉంటుంది. అప్పుడప్పుడు ధరల షాపుమూలంగా ద్రవ్యోల్బణం రేటు అధికమవుతుందని ఆర్‌బీఐ గవర్నర్ తెలియజేస్తూ ధరల పెరుగుదల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వంటనూనెలు, ఔషధాలు, వైద్యరంగానికి చెందిన ఇతర పరికరాల ధరలు, వైద్యచికిత్స వ్యయం, విద్యారంగంలో ఫీజుల పెరుగుదల, ప్రయాణఖర్చులు అపారంగా పెరిగిపోయాయి. ప్రస్తుతం ద్రవ్యోల్బణం పెరుగుతున్న ధోరణిని కేవలం కూరగాయల ధరల

పెరుగుదలకు ఆపాదించలేము. ఇది ఒక సీజన్‌లో జరిగేది మాత్రమే. అన్నిటికంటే వైద్య చికిత్స వ్యయం అపారంగా పెరిగింది. ఐదేళ్లకాలంలో పల్లెలు, ఒక మాదిరి పట్టణాలలో రెట్టింపు అయింది. నగరాలలో రెట్టింపుకంటే ఎక్కువగానే పెరిగింది. సామాన్యుడికి వైద్య చికిత్స ఎంతగానో భారమైంది. కొవిడ్-19 విజృంభణ కాలంలో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యరంగం ఏమాత్రం సహాయపడకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులచుట్టూ తిరిగిన సామాన్యుడు అనేక దేశాలలో ప్రత్యేకించి అభివృద్ధిచెందిన ఆర్థికవ్యవస్థలలో సైతం సెంట్రల్ బ్యాంకులు ద్రవ్యోల్బణం పెరుగుదలను నిరోధించేందుకుగాను అవసరమైన సానుకూల జర్నీలను తీసుకున్నాయి. వడ్డీరేట్లను పెంచడం వినిమయ ధరల సూచీ కొంచెం తగ్గిన తర్వాత కూడా పెంచిన వడ్డీరేట్లను కొనసాగించడం లాంటిచర్యలను తీసుకున్నాయి. ఈ చర్యలు తీసుకున్న విదేశాలలో బ్రెజిల్, కెనడా, ఐరోపా దేశాలు, అమెరికా, బ్రిటన్ తదితరాలు ఉన్నాయి. చైనాలో 2022 జనవరిలో ద్రవ్యోల్బణం రేటు 0.9శాతం మాత్రమే ఉన్నది. అక్కడ వడ్డీరేటు 3.7శాతంగా నిర్ణయించారు. ఫలితంగా చైనా ద్రవ్యోల్బణం రేటు ఈ ఏడాది జూన్‌లో 0శాతానికి పడిపోయింది. అయినప్పటికీ పీపుల్స్ రిపబ్లిక్ సెంట్రల్ బ్యాంకు వడ్డీరేటును 3.55శాతంగానే కొనసాగిస్తున్నది. ఐరోపా దేశాలలో గత సంవత్సరం వడ్డీరేటు 0 శాతం నుండి ఈ ఏడాది జూన్‌లో 4.5శాతానికి పెంచారు. ద్రవ్యోల్బణం పెరుగుదలను నివారించేందుకు ఈ చర్య తీసుకున్నారు. 2023 జూన్ చివరిలో అనేక దేశాలలో రుణాలపై రేట్లను ఎక్కువ స్థాయిలోనే బ్యాంకులు ఉంచాయి. ద్రవ్యోల్బణం రేట్లు తగ్గినప్పటికీ రుణాలపై వడ్డీరేట్లను ఎక్కువగానే కొనసాగించాయి. బ్రెజిల్‌లో వడ్డీరేటును 13.7శాతంగా కొనసాగించడం ఆసక్తిదాయకం. బ్రెజిల్‌లో అధిక వడ్డీరేట్ల మూలంగా ఆర్థికవ్యవస్థ మందగించినప్పటికీ 2023 మొదటి మూడునెలల కాలంలో ఊహించిన దానికంటే బాగాపుంజుకుంది. వ్యవసాయరంగంలో పరిస్థితి బ్రహ్మాండంగా మెరుగుపడటం వల్ల బ్రెజిల్ వార్షికవృద్ధి గణనీయంగా పెరిగింది. 2023లో ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం తగ్గుతోందని అంచనా వేస్తున్నప్పటికీ వడ్డీరేట్లు మాత్రం కొంతకాలం ఎక్కువగానే ఉంచాలని ఆయా దేశాలలో బ్యాంకులు నిర్ణయించాయి. అయితే ఈయన ప్రభావం జీడీపీపైన, బాండ్ల ద్వారావచ్చే ఆదాయంపైన, ద్రవ్యమారక రేట్లపైన ఉండవచ్చు. ఆర్థికరంగం ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. ద్రవ్యోల్బణాన్ని అంచనావేసే ఎకనామిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయు)ప్రకారం, అధిక వడ్డీరేట్లు సూక్ష్మ, ఆర్థికంగంపై ప్రభావం చూపుతాయని, ద్రవ్యోల్బణం కూడా అనేక దేశాలలో ఉపశమనం పొందవచ్చునని తెలిపింది. అయితే, ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు తక్షణం వడ్డీరేట్లను తగ్గించే విషయంలో జాగ్రత్త వహించాలని ఆ సంస్థ తెలిపింది. అమెరికాలో ద్రవ్యోల్బణం రేటు 2022 జనవరిలో 7.5శాతం కాగా, 2023 జూన్ నాటికి 3శాతానికి తగ్గింది. అయితే వడ్డీరేటును కాస్త ఆలస్యంగా 5.5 శాతానికి పెంచింది. అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను 2022 జనవరిలో 0.08శాతం నుండి 2022 సెప్టెంబరు చివరినాటికి 3.08 శాతానికి పెంచింది. మన ఆర్‌బీఐ ఆరుగురితో కూడిన ద్రవ్యవిధాన కమిటీ 2023-2024లో ద్రవ్యోల్బణం 5.1శాతం నుండి 5.4శాతానికి పెరగవచ్చునని ఇదే సమయంలో ఆహారవస్తువుల ధరలు పెరుగుతాయని అంచనావేసింది. జూన్‌లో ఆర్‌బీఐ ద్రవ్యోల్బణం అంచనాను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 5.1శాతం ఉండగా, దాన్ని 5.2శాతానికి పెరగవచ్చునని తెలిపింది. వినిమయ ధరల సూచీ 4శాతానికి కట్టడి చేయాలని ఆర్‌బీఐ ప్రభుత్వాన్ని గట్టిగాకోరింది. నరేంద్ర మోదీ ప్రభుత్వకాలంలో ధరల పెరుగుదలను మాత్రమే ప్రజలు అనుభవించారు. ఇంకా అనుభవిస్తూనే ఉన్నారు. ఏనాడు ధరలను ప్రభుత్వం కట్టడిచేసిన అనుభవం ప్రజలకు లేదు.

బీజేపీని గద్దె దింపడమే లక్ష్యం

తమిళనాడు సీఎం వినూత్న వీడియో

చెన్నై: కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి రాకుండా ఉండేందుకు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. ముంబైలో గురు, శుక్రవారాలలో జరిగే ఇండియా కూటమి సమావేశానికి వెళ్లే ముందు స్పీకింగ్ ఫర్ ఇండియా పాడ్‌కాస్ట్ వీడియోను స్టాలిన్ విడుదల చేశారు. 'చెక్ 1..2..3' అంటూ ఈ వీడియోను ఆయన మొదలుపెట్టారు. ఈ సిరీస్ 'ఉంగలిల్ ఒరువన్' తరహాలో ఉంటుందని తెలిపారు. ఒక నిమిషం 14 సెకన్ల నిడివిగల వీడియోలో దేశాన్ని బీజేపీ విధ్వంసం చేస్తున్నదని స్టాలిన్ విమర్శించారు. ప్రశ్న, దానికి సమాధానం తరహాలో ఈ వీడియో ఉంటుందని ప్రజలకు తెలియజేశారు. గత తొమ్మిదేళ్ల పాలనలో భారత్‌ను బీజేపీ తన విధానాలతో ఎలా విధ్వంసం చేసిందనే దానిపైనే తన ప్రసంగం ఉంటుందని స్టాలిన్ చెప్పారు. దేశ భవిష్యత్ బాగుండాలంటే ప్రజలు మరోసారి బీజేపీకి అవకాశం ఇవ్వరాదని సూచించారు. 2024 లోక్‌సభ ఎన్నికలు దేశంలో బీజేపీ పాలనకు ముగింపు పలుకుతాయన్నారు. ఇండియా కూటమి సమానత్వం, సౌభ్రాతృత్వం సూత్రాలను పాటిస్తుందని పేర్కొన్నారు.

కాగా ఇండియా కూటమి ఆలోచనలను దేశంలోని సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లడానికి స్టాలిన్ ప్రారంభించిన ఈ పాడ్‌కాస్ట్ సిరీస్ ఇంగ్లీష్‌తో ఇతర భాషలలో కూడా ఉంటుందని తెలుస్తోంది. ఇండియా కూటమిలో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రధాన పాత్ర పోషించనుంది. ఈ నేపథ్యంలో బీజేపీని ఎదుర్కోవడంలో ప్రతిపక్ష కూటమి ఇండియాకు బలమైన మద్దతు ఇచ్చే లక్ష్యంతో స్టాలిన్ పాడ్‌కాస్ట్ సిరీస్‌ను అమలు చేయాలని భావించారు.

'ఇండియా'ను ఓడించడం అసాధ్యం: రౌత్



ముంబై: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి విజయం సాధిస్తుందని శివసేన(యూబీటీ) నాయకుడు సంజయ్‌రౌత్ గురువారం విశ్వాసం వెలిబుచ్చారు. ఇండియాను ఓడించడం కష్టమే కాకుండా అసాధ్యం కూడానని వ్యాఖ్యానించారు. సంజయ్ రౌత్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ దేశంలోనే వివాదరహిత నేత అని చెప్పారు. రాహుల్‌గాంధీ నాయకత్వంలో పనిచేయాలని దేశం కోరుకుంటున్నదన్నారు. 'భారతీయ జనతాపార్టీలో భయం ఏర్పడింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుస్తుంది. ఇండియాను ఓడించడం బీజేపీకి దుర్లభమే'నని రౌత్ నొక్కి చెప్పారు. 'ఓ కార్యాచరణ ప్రణాళికతో మేము దేశం ముందుకు వస్తున్నాం' అని రాజ్యసభ సభ్యుడు కూడా అయిన రౌత్ తెలిపారు. ఇండియా కూటమిలోని ప్రతి ఒక్కరూ దేశ రక్షణకు కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. కూటమి పార్టీల్లో ఎలాంటి వైరుధ్యాలు లేవని చెప్పుకొచ్చారు.

ఇండియాలోకి మరిన్ని పార్టీలు: జయంత్

ముంబై: రానున్న రోజుల్లో ప్రతిపక్ష కూటమి ఇండియాలోకి మరిన్ని భావసారూప్యత గల పార్టీలు, నాయకులు వచ్చే అవకాశం ఉందని రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్‌డీ) నాయకుడు జయంత్ చౌదరి గురువారం చెప్పారు. 'మాకు కొంత సమయం ఇవ్వండి. మరిన్ని భావసారూప్యత గల పార్టీలు ప్రతిపక్ష కూటమిలో చేరతాయి' అని ముబై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ జయంత్ చెప్పారు. ఒకే లక్ష్యం, సిద్ధాంతం కోసం పనిచేస్తున్న దేశంలోని పార్టీలన్నీ ఒకేతాటిపైకి వస్తాయని తాను భావిస్తున్నానని జయంత్ అన్నారు. దేశంలో రాజకీయ మార్పు తీసుకురావడానికి సరైన ప్రత్యామ్నాయంగా ఇండియా కూటమి అవతరిస్తుందని ఆయన తెలిపారు.

బీజేపీని ఇంటికి పంపడం ఖాయం: అఖిలేశ్

లక్నో: పాలక బీజేపీ ప్రజలకు నమ్మకద్రోహం చేసిందని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. 2014లో అధికారం చేపట్టిన వారు 2024లో ఇంటికెళ్లడం ఖాయమని వ్యాఖ్యానించారు. ఇండియా ముంబై భేటీకి బయలుదేరడానికి ముందు ఇక్కడ విమానాశ్రయంలో అఖిలేశ్ గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇండియా కూటమి సమావేశాలు వరుసగా జరుగుతుండటం సంతోషంగా ఉందని అఖిలేశ్ చెప్పారు. ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్న విశ్వాసం ప్రజల్లో వచ్చిందని, బీజేపీ గద్దె దిగకతప్పదని తెలిపారు.

సామాన్యులను బీజేపీ మోసగించిందని విమర్శించారు. 80 పార్లమెంటు స్థానాలు గల ఉత్తరప్రదేశ్‌లో రానున్న ఎన్నికల్లో అఖిలేశ్ పాత్ర అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. 'ఎవరైతే ప్రజలను మోసగించారో...వారిని 2024 ఎన్నికల్లో ప్రజలు అధికారానికి దూరం చేస్తారు' అని అఖిలేశ్ స్పష్టంచేశారు.

విపక్షాల ఐక్యతతో బీజేపీలో భయం: మిలింద్

ముంబై: ప్రతిపక్ష కూటమి ఇండియాపై బీజేపీ చేస్తున్న ఆరోపణలను కాంగ్రెస్ నేత మిలింద్ డియోర తిప్పికొట్టారు. పెద్దసంఖ్యలో ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వస్తాయని బీజేపీ ఊహించలేదని, అందుకే కాషాయపార్టీ భయపడుతోందని మిలింద్ గురువారం ఇక్కడ విలేకరుల సమావేశంలో చెప్పారు. తమ కూటమి మరింత విస్తరించే అవకాశం ఉందని డియోర ఆశాభావం వెలిబుచ్చారు. 'రాజ్యాంగం పటిష్టవంతం కావాలని ప్రతిఒక్కరూ కోరుకుంటున్నారు. భారత రాజ్యాంగం పటిష్టవంతం కావాలంటే బీజేపీ వ్యతిరేక పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలి. ఆ లక్ష్యంతోనే విపక్షాలు ఐక్యమయ్యాయి' అని కేంద్ర మాజీమంత్రి డియోర పీటీఐకి చెప్పారు. 'కూటమికి సంబంధించిన పూర్తి వివరాలు శుక్రవారం విలేకరుల సమావేశంలో వెల్లడిస్తాం. ముంబైలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని విజయవంతం చేయడం కోసం ప్రతిపార్టీ ఐక్యంగా పనిచేస్తోంది. ముంబై భేటీ విజయవంతమైతే ఇండియా కూటమి విజయవంతమైనట్లే. ఇండియా కూటమి విజయవంతమైతే భారత రాజ్యాంగం పటిష్టవంతమైనట్లే. రాజ్యాంగం బలంగా ఉంటే ఇండియా పటిష్టవంతంగా ఉంటుంది' అని మిలింద్ డియోర స్పష్టంచేశారు. కూటమి పార్టీలపై బీజేపీ నేత సంబిత్ పాత్ర ఆరోపణలు ప్రస్తావించగా ప్రతపక్ష పార్టీలన్నీ ఐక్యమవుతాయని బీజేపీ ఊహించలేదని, అందుకే భయంతో అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని డియోర చెప్పారు. కూటమి ఇంకా విస్తరిస్తుందా అని అడుగగా దీనిపై ఇప్పుడే కచ్చితంగా చెప్పలేను గానీ...మరిన్ని పార్టీలు కూటమిలో చేరతాయని మాత్రం తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు.

ఎంపీలో బీజేపీ ఎమ్మెల్యే రాజీనామా

శివపురి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ మధ్యప్రదేశ్‌లో పాలక బీజేపీ శాసనసభ్యుడు వీరేంద్ర రఘువంశీ గురువారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. పార్టీలో తనను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఈ ఏడాది చివరిలో మధ్యప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణు దత్ శర్మకు వీరేంద్ర లేఖ రాశారు. దీనిని మీడియాకు విడుదల చేశారు. శివపురి జిల్లాలో కొలరస్ నియోజకవర్గానికి రఘువంశీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పార్టీలో తనకు ఎదురవుతున్న ఇబ్బందులు, తన బాధను నాలుగైదు ఏళ్ల నుంచి ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, పార్టీ అగ్రనాయకత్వానికి చెబుతున్నానని రఘువంశీ వెల్లడించారు. అయినా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గ్వాలియర్-చంబల్ డివిజన్‌లో 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ కోసం అంకితభావంతో పనిచేసినప్పటికీ తమను విస్మరించి...కొత్తగా పార్టీలోకి వచ్చిన సభ్యులకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. తాను చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆటంకం కలిగించడానికిగాను కొలరస్ నియోజకవర్గానికి అవినీతి అధికారులను నియమిస్తున్నట్లు ఆయన ఆరోపించారు. అదేసమయంలో బీజేపీ నాయకుడు, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. 2020లో కాంగ్రెస్ ప్రభుత్వం పతనమైనప్పుడు రైతులకు రెండు లక్షల రూపాయల రుణం మాఫీ చేయలేదని, అందుకే కాంగ్రెస్‌ను వీడుతున్నట్లు జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడారని, బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ మాటే మర్చిపోయారని ఆరోపించారు. మంత్రులు, అధికారులు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని రఘువంశి తన లేఖలో పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు పేరుతో నకిలీ వెబ్‌సైట్

న్యూఢిల్లీ: సైబర్ నేరగాళ్ల మోసాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ఇప్పటి వరకు అనేక సంస్థలు, వ్యక్తులు, బ్రాండ్ల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి ప్రజల వ్యక్తిగత సమాచారం దొంగలిస్తున్న ఈ మోసగాళ్లు తాజాగా దేశ సర్వోన్నత న్యాయస్థానాన్నే లక్ష్యంగా చేశారు. 'సుప్రీం కోర్టు ' పేరుతో నకిలీ వెబ్‌సైట్ రూపొందించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ ఈ విషయాన్ని స్వయంగా వెల్లడిస్తూ ఆ వెబ్‌సైట్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని లాయర్లు, వ్యాజ్యదారులను హెచ్చరించారు. సుప్రీంకోర్టు రిజిస్ట్రీ కూడా దీనిపై బహిరంగ నోటీసు జారీ చేసింది. 'సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా' పేరుతో ఒక నకిలీ వెబ్‌సైట్‌ను సృష్టించారు. రెండు యూఆర్‌ఎల్‌లను కూడా జనరేట్ చేశారు. వీటితో వ్యక్తిగత వివరాలు, రహస్య సమాచారాన్ని సేకరిస్తున్నారు. వీటిని ఎవరూ షేర్ చేయొద్దు. అందులో రహస్య సమాచారాన్ని పంచుకోవద్దు. సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఎన్నడూ ప్రజలు వ్యక్తిగత సమాచారాన్ని కోరదు. రహస్య వివరాలు, ఆర్థిక లావాదేవీల గురించి అడగదు" అని రిజిస్ట్రీ తమ నోటీసులో పేర్కొంది. "సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా ఎ.ఎ.ఎ.ఎ.వ్రశీజ.ఱఅ డొమైన్‌తో రిజిస్టర్ అయి ఉంది. ఈ కోర్టు పేరుతో ఏదైనా యూఆర్‌ఎల్ వస్తే దాన్ని క్లిక్ చేసే ముందు ఒరిజినల్ డొమైన్‌తో సరిచూసుకోండి. ఒకవేళ సైబర్ దాడికి గురైతే గనుక వెంటనే మీ అన్ని ఆన్‌లైన్ ఖాతాలు, బ్యాంక్ అకౌంట్ల పాస్‌వర్డ్‌లను మార్చుకోండి" అని రిజిస్ట్రీ సూచించింది. ఈ నకిలీ వెబ్‌సైట్ గురించి ఇప్పటికే దర్యాప్తు సంస్థల దృష్టికి తీసుకెళ్లామని, ఇందుకు బాధ్యులను తప్పకుండా శిక్షిస్తామని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ కూడా దీని గురించి ప్రజలను హెచ్చరించారు. "నకిలీ వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్తగా ఉండండి. సుప్రీంకోర్టు పేరుతో వస్తున్న ఆ నకిలీ లింక్‌లను క్లిక్ చేయొద్దు. దాన్ని నగదు లావాదేవీలకు ఉపయోగించొద్దు" అని న్యాయవాదులు, వ్యాజ్యదారులకు ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

అది స్వార్థకూటమి: బీజేపీ నేత పాత్ర

న్యూఢిల్లీ: ప్రతిపక్ష 'ఇండియా' కూటమిని 'స్వార్ధ కూటమి'గా బీజేపీ పేర్కొన్నది. కూటమిలోని భాగస్వామ్య పార్టీల కుటుంబాల ప్రయోజనాలు పరిరక్షించడం, అభివృద్ధి చేసే లక్ష్యంతోనే ఈ కూటమి ఏర్పడిందని ఆరోపించింది. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలన్నీ కూటమిగా ఏర్పడటంపై ఆ పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్ర గురువారం స్పందిస్తూ ఇంధనం లేని కారణంగా కాంగ్రెస్ క్షిపణి ఎప్పటికీ ప్రారంభం కాదన్నారు. అభివృద్ధి ఇంధనంతో నిండిన బీజేపీ చంద్రయాన్ రానున్న లోకసభ ఎన్నికల్లోనూ మూడోసారి విజయవంతమవుతుందని సంబిత్ పాత్ర చెప్పారు. ఇండియా కూటమి కనీస ఉమ్మడి కార్యక్రమం(సీఎంపీ) గురించి చర్చిస్తున్నదని, వాస్తవంగా అవినీతి ద్వారా ఎవరు ఎక్కువ లబ్ధిపొందవచ్చునే అంశంపైనే సీఎంపీ రూపకల్పన ఉంటుందని ఆరోపించారు. ఈ పార్టీలన్నీ దాదాపు రూ.20 లక్షల కోట్ల కుంభకోణాలకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో కొనసాగుతున్న అభివృద్ధి అనుకూల, సుస్థిర ప్రభుత్వాన్ని కూల్చడం ఇండియా లక్ష్యమని ఆరోపించారు.

ఆ ఆరోపణలు అవాస్తవం: రెజ్లర్ రౌనక్

న్యూఢిల్లీ: జాతీయ స్థాయి మహిళా రెజ్లర్ రౌనక్ గులియా దంపతులు తనను రూ.50లక్షల మేర మోసగించారని ఆరోపిస్తూ తీహార్ జైలు అధికారి దీపక్ శర్మ్ చేసిన ఆరోపణలను రౌనక్ తీవ్రంగా ఖండించారు. ఈ ఆరోపణలలో వాస్తవంలేదన్నారు. తాజాగా ఇన్‌స్టాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. 'ఇదే తన చివరి వీడియో' అని కన్నీళ్లు పెట్టుకున్నారు. బాడీ బిల్డర్ కాప్‌గా గుర్తింపు తెచ్చుకున్న దీపక్ శర్మ తీహార్ జైల్లో అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఆయన ప్రొఫెషనల్ రెజ్లర్ దంపతులైన రౌనక్ గులియా, అంకిత్ గులియాపై చీటింగ్ కేసు పెట్టారు. ఒక రియాల్టీ షోలో రౌనక్ గులియాతో దీపక్‌కు పరిచయం ఏర్పడింది. తన భర్త రెజ్లింగ్‌తో పాటు ఆరోగ్య ఉత్పత్తుల వ్యాపారం నిర్వహిస్తున్నారని రౌనక్ చెప్పినట్లు ఆ ఫిర్యాదులో దీపక్ తెలిపారు. వ్యాపారాన్ని విస్తరించాలనుకుంటున్నామనీ, ఇందుకు మదుపుదారులు కావాలని ఆమె కోరినట్లు చెప్పారు. మంచి లాభాలు వస్తాయని ఆశ జూపి తనతో రూ.50లక్షలు పెట్టుబడి పెట్టించారని తెలిపారు. ఆ తర్వాత ఆ సొమ్ము తిరిగిచ్చేందుకు గులియా దంపతులు నిరాకరించడంతో తాను కేసు పెట్టానని చెప్పారు. దీపక్ శర్మ ఫిర్యాదు మేరకు గులియా దంపతులపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి రెజ్లర్ దంపతులు జాడ లేకుండా పోయారు. ఈ క్రమంలోనే తాజాగా రౌనక్ గులియా ఇన్‌స్టాలో ఒక వీడియో పోస్ట్ చేశారు. "ఇదే నా చివరి వీడియో. నన్ను క్షమించండి. ఇంతకంటే భరించే శక్తి లేదు. దేవుడే ఆయన్ను (దీపక్‌ను ఉద్దేశిస్తూ) చూస్తాడు. ఆయన తప్పులకు ఆ భగవంతుడే శిక్ష విధిస్తాడు" అని రౌనక్ కన్నీళ్లు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ కేసు గురించి దీపిక్ శర్మ తమను గతంలో బెదిరించారని రౌనక్ తెలిపారు.

నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాలతో ముగిశాయి. వార, మాస ఆప్షన్ల ఎక్స్‌పైరీ నేపథ్యంలో మార్కెట్లు తీవ్ర ఒడుదొడులకు లోనయ్యాయి. గురువారం ఉదయం స్వల్ప లాభాలతో ట్రేడింగ్ ప్రారంభించిన మార్కెట్లు మధ్యాహ్నం వరకు ఊగిసలాడాయి. తర్వాత పూర్తిగా నష్టాల్లోకి కూరుకుపోయాయి. సెన్సెక్స్ 65,178.33 దగ్గర లాభాలతో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 65,277.04 నుంచి 64,723.63 మధ్య కదలాడింది. చివరకు 255.84 పాయింట్ల నష్టంతో 64,831.41 దగ్గర స్థిరపడింది. నిఫ్టీ 19,375.55 దగ్గర ప్రారంభమై ఇంట్రాడేలో 19,388.20 నుంచి 19,223.65 మధ్య ట్రేడ్ అయింది. చివరకు 93.65 పాయింట్లు నష్టపోయి 19,253.80 దగ్గర ముగిసింది.

జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలకు సిద్ధం

- ఎప్పుడు... ఎలా అన్నది ఈసీ నిర్ణయించాలి
- రాష్ట్రహోదా పునరుద్ధరణకు సమయం పడుతుంది
- సుప్రీంకోర్టులో సొలిసిటర్ జనరల్ వాదనలు
- కేంద్రానివన్నీ తప్పుడు లెక్కలు : ఎన్‌సీ తరపు న్యాయవాది సిబల్

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్ ఎన్నికలు ఎప్పుడైనా నిర్వహించవచ్చుగానీ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కొంత సమయం పడుతుందని సుప్రీంకోర్టుకు కేంద్రప్రభుత్వం వెల్లడించింది. ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితాకు సంబంధించిన పని చివరి దశలో ఉందని తెలిపింది. ఎన్నికలను ఎప్పుడు, ఎలా నిర్వహించాలన్నది ఎన్నికల సంఘం నిర్ణయించాల్సి ఉంటుందని చెప్పింది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఆర్టికల్ 370 రద్దుపై గురువారం విచారించింది. జమ్మూకశ్మీర్‌కున్న కేంద్ర పాలిత ప్రాంత హోదా తాత్కాలికమేనని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. పూర్తిస్థాయిలో రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కొంత సమయం పడుతుందని చెప్పారు. కేంద్రం తరఫున ఆయన వాదనలు వినిపించారు. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించాల్సి ఉంటుందని, తొలి దశలో పంచాయతీలకు, రెండవదశలో స్థానిక సంస్థలకు, మూడో దశలో అసెంబ్లీకి ఎన్నికలు జరపాలని చెప్పారు. ఏ ఎన్నికలను ఎప్పుడు, ఎలా నిర్వహించాలో భారత ఎన్నికల కమిషన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించాల్సి ఉందని మెహతా అన్నారు. ఓటర్ల అప్‌డేషన్ దాదాపు పూర్తి అయిందని చెప్పారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా పునరుద్ధరించడానికి అవసరమైన నియామవళిని రూపొందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూ.7వేలకోట్ల పెట్టుబడులకు హామీనివ్వగా అందులో రూ.2వేల కోట్ల పెట్టుబడులు ఇప్పటికే పెట్టినట్లు చెప్పారు. 53 ప్రధానమంత్రి సంక్షేమ ప్రాజెక్టులలో 32 పూర్తి అయ్యాయని అన్నారు. పోలీసింగ్‌తో శాంతి నెలకొనబోదని మెహతా వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లో 2018తో పోల్చితే ఉగ్రవాద సంబంధిత ఘటనలు 45.2శాతం తగ్గాయని, అక్రమ చొరబాట్లు 90.2శాతం తగ్గిపోగా రాళ్ల దాడులు, హర్తాళ్లు, వేర్పాటువాదుల ప్రోద్బలంతో బంద్‌ల నిర్వహణ వంటివి శూన్యమన్నారు. భద్రతా సిబ్బందికి ప్రాణ నష్టం కలిగించే ఘటనల్లో 60.9 తగ్గుదల నమోదైనట్లు చెప్పారు. లడాఖ్ విషయానికొస్తే లేహ్, కార్గిల్ ప్రాంతాలు ఉంటాయని, లేహ్‌లో గిరి అభివృద్ధి మండలి ఎన్నికలు జరిగాయని, కార్గిల్‌లో వచ్చేనెలలో ఈ ఎన్నికలు జరుగుతాయని మెహతా చెప్పారు. అయితే కేంద్ర వాదనను జమ్మూకశ్మీర్ నేషనల్ ఫెడరేషన్ నాయకుడు మహమ్మద్ అక్బర్ లోనె తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ తప్పుపట్టారు. తప్పుడు లెక్కలు చూపుతూ కోర్టును, దేశ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించి కేంద్రం చెప్పేది వింటే కోర్టు అభిప్రాయం మారవచ్చన్నారు. సీజేఐ చంద్రచూడ్ స్పందిస్తూ అలా ఏమీ జరగబోదని సిబల్‌కు అభయమిచ్చారు. కోర్టు ప్రశ్నలకు మెహతా సమాధానాలిచ్చారన్నారు. ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు కేంద్రం తీసుకునే చర్యలు, కార్యాచరణ ప్రణాళికను మాత్రమే వెల్లడించారని చెప్పారు. ప్రభుత్వం చెప్పే అభివృద్ధి అంతా 2019 ఆగస్టు తర్వాత జరిగింది కాబట్టి మీరు సవాల్ చేసే అంశంపై ఎలాంటి ప్రభావం ఉండదని సిబల్‌తో సీజేఐ అన్నారు. సిబల్ వాదిస్తూ 'జీరో హర్తాళ్లు అంటున్నారు. వాస్తవానికి ఐదువేల మంది గృహ నిర్బంధంలో ఉంచారు. అప్పుడు హర్తాళ్లు ఎలా జరుగుతాయి. వారిని ఆసుపత్రికి కూడా వెళ్లనివ్వడం లేదు. కోర్టు విచారణ ప్రత్యక్షప్రసారం అవుతుంది కాబట్టి కేంద్రప్రభుత్వ గణాంకాల వల్ల ప్రజాభిప్రాయం ప్రభావితం అవుతుంది' అని అన్నారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ విధానపరమైన వ్యత్యాసాలు ఉండొచ్చుగానీ రాజ్యాంగబద్ధ వాదనలపై ఈ లెక్కడ ప్రభావం ఏ మాత్రం ఉండబోదని హామీనిచ్చారు.

అవినీతి స్నేహితులకు మోదీ భద్రత

ఓసీసీఆర్‌పీ నివేదికపై ప్రతిపక్షాల వ్యాఖ్య

న్యూఢిల్లీ: తన అవినీతి స్నేహితులకు ప్రధాని మోదీ భద్రత కల్పిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. తాజాగా అదానీ సంస్థకు చెందిన మరో మోసాన్ని ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్ (ఓసీసీఆర్‌పీ) గురువారం బయటపెట్టిన సంగతి తెలిసిందే. మోదీతో అదానీకి ఉన్న సంబంధాలు స్టాక్ మార్కెట్‌లో విస్తృతంగా జరుగుతున్న మోసం, అవకతవకలకు వ్యతిరేకంగా నియంత్రణ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఓసీసీఆర్‌పీ నిర్ధారించినట్లు సీపీఎం ఓ ప్రకటనలో తెలిపింది. తాజా నివేదికపై దర్యాప్తు అవసరమని తేల్చిచెప్పింది. ఇందులో ఎలాంటి అవకతవకలు లేవని నిగ్గు తేల్చడానికి సుప్రీంకోర్టు విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది. భారత నియంత్రణ, దర్యాప్తు సంస్థలను నిర్వీర్యం చేయడం ద్వారా అవినీతి స్నేహితులను, వారి దుశ్చర్యలను రక్షించడానికి ప్రధాని ఎంత దూరమైనా వెళతారని ఇది గుర్తు చేస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ చెప్పారు. అవినీతిపరులను విచారించడానికి బదులుగా ప్రతిపక్షాలను బెదిరించే రాజకీయ సాధనంగా దర్యాప్తు సంస్థలను మోదీ సర్కారు వినియోగిస్తోందని మండిపడ్డారు. హమ్ అదానీ కే హై కౌన్ (హెచ్‌ఏహెచ్‌కే) సిరీస్‌లో భాగంగా అదానీతో తనకున్న అస్పష్టమైన సంబంధం గురించి ప్రధానిని కాంగ్రెస్ అడిగిన వంద కంటే ఎక్కువ ప్రశ్నలకు సమాధానం ఈ నివేదిక ద్వారా వెల్లడవుతోందని అన్నారు. సెబీ, ఈడీలకు బదులుగా అదానీ సంస్థల మోసాలపై జర్నలిస్టులు ఆ విధులు నిర్వర్తిస్తున్నారని శివసేన (యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది వ్యాఖ్యానించారు. మోదీకి స్నేహంగా లేని సంస్థలు ఈ అవకతవకలకు పాల్పడి ఉంటే భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చేదని కాంగ్రెస్ నేత సల్మాన్ అనీస్ సోజ్ పేర్కొన్నారు.

త్వరలో జొమాటో నుంచి పూర్తిగా నిష్క్రమిస్తాం: జపనీస్ బ్యాంక్ సాఫ్ట్

న్యూఢిల్లీ: జపనీస్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం సాఫ్ట్ బ్యాంక్, జొమాటోలో దాదాపు 10 కోట్ల షేర్లను విక్రయించింది. ఇది కంపెనీ ఈక్విటీలో 1.17 శాతం. రాబోవు నెలల్లో సాఫ్ట్ బ్యాంక్ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫారమ్ నుంచి పూర్తిగా నిష్క్రమించేందుకు యోచిస్తోంది. జొమాటోలో సాఫ్ట్ బ్యాంక్ 2.18 శాతం వాటాను కలిగి ఉంది. దానిని బ్లాక్ డీల్స్ ద్వారా విక్రయించే అవకాశం ఉంది. సాఫ్ట్ బ్యాంక్ గతేడాది జూన్‌లో జొమాటో వాటాను దాదాపు రూ.71కి కొనుగోలు చేసింది. కంపెనీకి జొమాటో కేవలం పెట్టుబడి పెట్టడమే కాకుండా కంపెనీ గణనీయమైన లాభాలను అర్జించింది. ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫారమ్ జొమాటోకు చెందిని 10 కోట్ల షేర్లు కంపెనీ ఈక్విటీలో 1.17 శాతం, మొత్తం డీల్ విలువ సుమారు రూ.947 కోట్లు చేతులు మారాయి. సాఫ్ట్ బ్యాంక్ ఎస్‌బీఎఫ్ గ్రోత్ ఫండ్ ఈ మెగా లావాదేవీలో విక్రయించే అవకాశం ఉంది.

రష్యా నుంచి తగ్గిన చమురు దిగుమతులు

న్యూఢిల్లీ: భారీ వర్షాలు డిమాండును తగ్గించడంతో పాటు రిఫైనర్లు సాధారణ నిర్వహణ పనులను షెడ్యూల్ చేయడంతో చౌకైన రష్యన్ చమురు కోసం మనదేశ అవసరాలు కొద్దిగా ఊపిరి పీల్చుకున్నాయి. డేటా ఇంటలిజెన్స్ సంస్థ కేప్లర్ ప్రకారం, ప్రపంచంలోని మూడవ అతిపెద్ద చమురు వినియోగదారైన భారత్, మాస్కో నుంచి దిగుమతులను ఆగస్టులో వరుసగా మూడవ నెలలో రోజుకు 1.57 మిలియన్ బారెల్స్‌కు తగ్గించింది. ఆగస్టులో 24 శాతం తగ్గిందని, జనవరి నుంచి వాటిని కనిష్ట స్థాయికి తీసుకొచ్చిందని డేటా తెలుపుతుంది. భారతీయ రిఫైనర్లు మరో అగ్ర సరఫరాదారు అయిన ఇరాక్ నుంచి ఆగస్టు నెలలో రోజుకు 8,48,000 బ్యారెళ్లకు 10 శాతం ఎగుమతులను తగ్గించారు. ఆ పరిమాణంలలో కొన్ని సౌదీ అరేబియా నుంచి దిగుమతులలో చురుకైన పెరుగుదలతో భర్తీ చేయబడ్డాయి. ఇది నెలలో 63 శాతం పెరిగి రోజుకు 8,52,000 బ్యారెల్స్‌కు చేరుకుందని డేటా వెల్లడించింది. గతేడాది నుంచి మనదేశ రష్యన్ చమురు వినియోగం పెరిగింది. మేలో రోజుకు గరిష్టంగా 2.15 మిలియన్ బ్యారెల్స్‌ను తాకింది. యూనిట్ రోజుకు 3,01,000 బ్యారెళ్ల సామర్థ్యం కలిగి ఉన్న మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్... దిగుమతులను మూడింట రెండు వంతులు తగ్గించింది. సెప్టెంబరులో చమురు శుద్ధి యూనిట్‌ను మూసివేయాలని యోచిస్తుండటం వల్ల రిలయన్స్ ఇండస్ట్రీస్ కొనుగోళ్లు సాధారణ సగటు 1.2 నుంచి 1.3 మిలియన్ బ్యారెల్స్ నుంచి రోజుకు 1.1 మిలియన్ బ్యారెల్స్‌కు పడిపోయాయని కేప్లర్‌కు చెందిన ప్రధాన చమురు విశ్లేషకులు అంటున్నారు. భారతదేశ మొత్తం ముడి దిగుమతులు ఆగస్టులో నెలలో 7 శాతం క్షీణించి, రోజుకు 4.35 మిలియన్ బ్యారెల్స్‌కు తగ్గాయి. ఉత్పత్తి డిమాండు నాలగవ త్రైమాసికంలో పుంజుకుంటుంది. పెద్ద ఎత్తున నిర్వహణ ఉండని కారణంగా అక్టోబర్ నుంచి పుంజుకునే అవకాశం ఉందని కేప్లర్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఏప్రిల్-జులైలో ఆర్థిక లోటు రూ.6.06 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు నెలలకు జులై వరకు భారతదేశ ఆర్థిక లోటు రూ.6.06 లక్షల కోట్లు లేదా వార్షిక అంచనాలలో 33.9 శాతంగా ఉందని ప్రభుత్వ గణాంకాలు గురువారం వెల్లడించాయి. ఇదే కాలంలో గతేడాది నివేదించిన 20.5 శాతం నుంచి ద్రవ్య లోటు విస్తరించింది. వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికల తర్వాత మూడోసారి అధికారంలోకి రావాలని చూస్తున్న నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం త్వరలో వివిధ ఆర్థిక చర్యలను ప్రారంభించాలని యోచిస్తుంది. కేంద్రం ఈ వారం ఎల్‌పీజీ సిలిండర్ ధరలను యూనిట్‌కు రూ.200 తగ్గించిన తర్వాత ఆర్థిక ప్రభావం పరిమితంగా కనిపిస్తున్నప్పటికీ ప్రస్తుతానికి ఈ చర్య కేవలం చమురు శుద్ధి కర్మాగారాల లాభాల మార్జిన్‌లను మాత్రమే తగ్గించేలా కనిపిస్తోంది. పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలనే డిమాండు పెరుగుతోంది. ధరలు బడ్జెట్ గ్యాప్‌పై ప్రభావం చూపవచ్చు. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా కేంద్ర ఖజానాకు రూ.87.416 కోట్ల మిగులు బదలాయింపు పెద్ద పరిపుష్టిని అందించింది. దాంతో పాటు పన్నుయేతర ఆదాయాలను ఎత్తివేసింది. ఈ మొత్తం వసూళ్లు రూ.7.75 లక్షల కోట్లు. అయితే, ఏప్రిల్-జులైలో మొత్తం వ్యయం రూ.13.81 లక్షల కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లక్ష్యంలో అవి 28.5 శాతం, 30.7 శాతంగా ఉన్నాయి.

రాష్ట్రంలో దోపిడీ పాలన

- అదానీ, అంబానీలకు అప్పనంగా భూముల అప్పగింత
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దోపిడీ పాలన సాగిస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూమి, ఇసుక, ఎర్రచందనం లాంటి వనరుల దోపిడికి పాల్పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. రాష్ట్రాన్ని రక్షించండి... దేశాన్ని కాపాడండి నినాదంతో సీపీఐ ప్రారంభిం చిన బస్సుయాత్ర గురువారం కడప జిల్లా ప్రొద్దుటూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో నిర్వహించిన సభలో రామకృష్ణ మాట్లా డుతూ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న ఈ 4సంవత్సరాలలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యం అన్నారు. మద్య నిషేధంపై మాట మార్చి మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని, మద్యంపై వచ్చిన ఆదాయం నేరుగా తాడేపల్లిలోని జగన్ ఇంటికి చేరుతున్నదని విమర్శించారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామని చెప్పి ఏ ఒక్క ప్రాజెక్టు కట్టలేని దుస్థితి అన్నారు. ప్రాజెక్టుల మరమ్మతుల కోసం నిధులు కేటాయిం చకపోవడంతో అన్నమయ్య ప్రాజెక్టు, పింఛా ప్రాజెక్టులు కొట్టుకు పోయి 40మంది మృత్యువాత పడ్డారని, ఎన్నో పశువులు చనిపోయాయని గుర్తుచేశారు. అసైన్డ్ భూములు కబ్జా చేసేందుకు ఆర్డినెన్స్ జారీ చేసి రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకులకు భూములను దారాదత్తం చేసేందుకు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు నిమగ్నం అయ్యారని అన్నారు. ఆదాని, అంబానీల జపం చేస్తున్నారని, ప్రకాశం డెయిరి అమూల్ కంపెనీకి దారా దత్తం చేసి రూ.1000కోట్లు విలువ చేసే భూములను చిత్తూరు డెయిరీకి అప్పజెప్పి రూ.500కోట్లు విలువచేసే భూములను ఆదానికి అప్పజెప్పారని ఇందులో ఎంత కమీషన్ జగన్‌కు ముట్టిందో ప్రజలకు తెలపాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ భారతదేశం హిందూ దేశం అని భారతీయులందరు బీజేపీకి ఓటు వేయాలని ఒక పక్క చెబుతూనే మరో పక్క హిందువులకు, క్రైస్తవులకు, ముస్లింల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకే ప్రైవేటువైపు మొగ్గు చూపు తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, ప్రజానాట్య మండలి చంద్రనాయక్, నాగసుబ్బారెడ్డి, బషీరున్నీసా, శ్రీరాములు, సుబ్బ రాయుడు, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సందీప్, సురేష్, షరీఫ్‌తో పాటు పెద్దఎత్తున సీపీఐ, ప్రజాసంఘాల శ్రేణులు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ: సీపీఐ బస్సుయాత్ర గురువారం ప్రొద్దుటూరుకు చేరుకున్న సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఓబులేసు తదితర నాయకులకు ఘనంగా స్వాగతం పలికారు. మైదుకూరు రోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఆర్టీసి బస్టాండు మీదుగా శివాలయం సర్కిల్‌లో గల బహిరంగ సభ వేదిక వరకు సాగింది. బహిరంగ సభలో ప్రజానాట్య మండలి కళాకారులు పాటలతో అందరిని అలరింపచేశారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్రనాయక్ ఆధ్వర్యంలో బృందం పాటలు ఆలపించింది.

బస్సు యాత్ర నేటి షెడ్యూల్

నంద్యాల ప్రాజెక్టులపై సదస్సు

కర్నూలులో బహిరంగ సభ

ఇది గజదొంగల రాజ్యం

- దోపిడీ తప్ప అభివృద్ధి పట్టని జగన్
- జమ్మలమడుగు సభలో రామకృష్ణ

విశాలాంధ్ర-జమ్మలమడుగు: ఆంధ్రప్రదేశ్‌లో గజదొంగల రాజ్యం నడుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. 'రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి' నినాదంతో సీపీఐ చేపట్టిన బస్సుయాత్ర గురువారం వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగులోకి ప్రవేశించింది. ఇక్కడ జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ నాలుగేళ్లలో రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని, అసమర్థ పాలనతో సీఎం జగన్ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టేశారని విమర్శించారు. తన కేసుల మాఫీ కోసం సీఎం జగన్ కేంద్ర పెద్దల దగ్గర నోరెత్తడం లేదన్నారు. పాలన అనుభవం లేని జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్సీ దేవగుడి ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ స్టీల్ ఫ్యాక్టరీకి కావాల్సిన అన్ని వనరులు జమ్మలమడుగులో శంకుస్థాపనలతోనే జగన్ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన అనుచరులతో యంత్రాల సాయంతో ఇసుకను ఇతర ప్రాంతాలకు విచ్చల విడిగా అమ్మేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తులసీరెడ్డి మాట్లాడుతూ గండికోట ప్రాజెక్టులో 22 టీఎంసీల నీరు ఉన్నా...వాటిని కాలువల ద్వారా పంట పొలాలకు అందించడం లేదన్నారు. మద్యం, ఇసుక ద్వారా వచ్చే అక్రమ సంపాదన తాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతుందని ఆరోపించారు. సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏరియా కార్యదర్శి సుబ్బారెడ్డి, పట్టణ కార్యదర్శి ప్రసాద్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి కళాబృందాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాయి.

చందమామపై ప్రజ్ఞాన్ బిజీబిజీ

బెంగళూరు: చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా చంద్రుడిపై రోవర్ ప్రజ్ఞాన్ పరిశోధనలు చకచక సాగుతున్నాయి. జాబిల్లిపై సల్ఫర్ ఉన్నట్లు ప్రజ్ఞాన్‌లోని మరొక పరికరం కూడా ధ్రువీకరించినట్లు ఇస్రో గురువారం వెల్లడించింది. సురక్షిత మార్గ అన్వేషణలో తిరుగుతున్న రోవర్ భ్రమణాన్ని ల్యాండర్ ఇమేజర్ కెమెరా క్లిక్‌మనిపించింది. 'అమ్మ ప్రేమగా చూస్తుండగా చందమామ పెరట్లో పిల్లాడు అడుకుంటున్నట్లుగా ఇది ఉంది కదా!' అంటూ ఇస్రో ట్వీట్ చేసింది. అదే సమయంలో జాబిల్లి ఉపరితలంపై సల్ఫర్ ఆనవాళ్లను ఆల్ఫా పార్టికల్ ఎక్స్‌రే స్పెక్ట్రోస్కోప్ (ఏపీఎక్స్‌ఎస్) ధ్రువీకరించినట్లు ఇస్రో తెలిపింది. ఇంకొన్ని ఖనిజాలు కూడా ఉన్నట్లు తెలుస్తోందని పేర్కొంది. సీహెచ్-3 పరిశీలనతో ఈ ప్రాంతంలో సల్ఫర్ (ఎస్)కు మూలాన్ని అన్వేషించే పనిలో శాస్త్రవేత్తలు నిమగ్నమవుతారని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేసిన పోస్టు వెల్లడించింది. అంతకుముందు లేజర్ ఇండూస్ట్ బ్రేక్‌డౌన్ స్పెక్ట్రోస్కోప్ (ఎల్ఐబీఎస్) పరికరం సల్ఫర్ ఉండటాన్ని గుర్తించింది. దీనిపై సమగ్ర శాస్త్రీయ అధ్యయనం పురోగతిలో ఉంది. 26 కిలోల బరువుతో ఆరు చక్రాలపై నడుస్తూ, సౌరశక్తితో పనిచేస్తున్న ప్రజ్ఞాన్ రోవర్‌ను చంద్రుడి ఉపరితలంపై మట్టి, రాళ్లు, ఖనిజాలను గుర్తించేలా రూపొందించారు. ఇన్-సిటూ అధ్యయనాలకు ఏపీఎక్స్ఎస్ పరికరం అన్ని విధాలుగా అనువైనదని ఇస్రో వెల్లడించింది.

హోరెత్తిన యర్రగుంట్ల

- సీపీఐ రోడ్‌షోకు అపూర్వ ఆదరణ
- దప్పువాయిద్యాలు, విప్లవగీతాలతో ఆకట్టుకున్న ప్రజానాట్యమండలి

విశాలాంధ్ర-యర్రగుంట్ల : పారిశ్రామిక ప్రాంతంగా గుర్తింపు పొందిన కడప జిల్లా యర్రగుంట్లకు గురువారం ఉదయం సీపీఐ బస్సు యాత్ర చేరుకోగానే ప్రజానాట్య మండలి కళాకారులు డప్పు వాయిద్యాలతో విప్లవ గీతాలు ఆలపిస్తూ స్వాగతించారు. ఈ ప్రాంతంలోని జువారి, ఎర్రగుంట్ల, చిలమకూరు ఐసీఎల్ సిమెంటు పరిశ్రమలతో పాటు ఆర్టీపీపీ నుంచి తరలివచ్చిన ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు సీపీఐ నేతలకు ఎదురెళ్లి సాదర స్వాగతం పలికారు. బస్సు యాత్ర కడప రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండు మీదుగా వేంపల్లె రోడ్డుకు చేరుకుంది. అక్కడి నుంచి నేతలు కాలినడకన కూడలికి వచ్చారు. స్థానిక టీడీపీ శ్రేణులు సైతం సీపీఐ నేతలకు పూలమాలలు వేసి సంఘీభావాన్ని తెలిపారు. కొద్దిసేపు టీడీపీ శ్రేణులు సీపీఐ నాయకులతో కలిసి నడిచారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ నేతలతో కరచాలనం చేసేందుకు, వారికి పూలమాలలు వేసేందుకు చాలా మంది ఉత్సాహం చూపారు. సీపీఐ నేతలు సైతం వారిని పలుకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకొని ఆలింగనం చేసుకున్నారు. ముఖ్యంగా ఇక్కడ ఎన్నో ఏళ్ల నివాసం ఉండి కార్మికుల పక్షాన ఉద్యమించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఓబులేసు స్థానికులను పేరుపేరున ఆప్యాయంగా పలుకరించారు. ఆయనతో మాట్లాడేందుకు అనేక మంది ఉత్సుకత ప్రదర్శించారు. ఎర్రగుంట్ల ప్రాంతంతో దశాబ్దాల అనుబంధం కలిగిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మోములో చిరునవ్వులు స్పష్టంగా కనిపించాయి. స్థానికులతో కలిసి ఆయన ఉత్సాహంగా నాలుగు రోడ్ల కూడలిలో నడిచారు. ఈ సందర్భంగా కార్మికులు సీపీఐ నేతలకు తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఒక వైపు ప్రజానాట్య మండలి కళారూపాలు, మరోవైపు డప్పు వాయిద్యాల హోరు చూపరులను ఆకట్టుకుంది. బస్సు యాత్రలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి, మండల కార్యదర్శి భవానీ శంకర్‌తో పాటు ఏఐటీయూసీ నాయకులు చాంద్‌బాష, రాధాకృష్ణ, ఓబుల్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, టీడీపీ శ్రేణులు పసుపుల రమేష్‌రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణయ్య, కోడూరు శివశంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమికి భయపడే...

జమిలీ ఎన్నికలకు బీజేపీ ప్రయత్నం

సీపీఐ కార్యదర్శి నారాయణ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇండియా కూటమికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భయపడి అర్థంతరంగా జమిలీ ఎన్నికలకు ప్రయత్నిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ఇండియా కూటమికి ఆదరణ పెరగడం, ఎన్డీయే నుంచి కూడా కొన్ని పార్టీలు ఇండియా కూటమి వైపు వెళ్లడం, ముంబైలో ఇండియా కూటమి సమావేశాలు దిగ్విజయంగా జరుగుతుండటంతో బీజేపీలో ఆందోళన మొదలైందన్నారు. ఐదు రాష్ట్రాల్లో త్వరలో జరగనున్న ఎన్నికల్ని ఎదుర్కోవడం బీజేపీకి అసాధ్యంగా మారిందన్నారు. ఎన్డీఏను ఓడించే క్రమంలో ఇండియా కూటమి బలపడుతోందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఆలస్యం చేస్తే ఇండియా కూటమి బలపడి, బీజేపీ మరింత బలహీన పడుతుందనే ఆందోళనతో అర్ధంతరంగా ముందస్తు ఎన్నికలకు కేంద్రం ప్రయత్నిస్తోందని తెలిపారు. ఆరెస్సెస్ భావజాల సిద్ధాంతో ఒకే ఎన్నికలు, ఒకే భాష తదితర నినాదాలతో బీజేపీ ముందుకుపోతోందని విమర్శించారు. భారత సమాఖ్య, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రంలోని మోదీ పాలన కొనసాగుతోందన్నారు. ఏకఛత్రాధిపత్యంగా ఒకరే పాలన కొనసాగించేలా ప్రజాస్వామ్య, లౌకిక విధానాలకు వ్యతిరేకంగా ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని నారాయణ విమర్శించారు.

మండలాల్లో మొబైల్ కోర్టులు

శాశ్వత భూహక్కు-భూరక్ష సమీక్షలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భూ వివాదాలను ఎక్కడికక్కడ పరిష్కరించడానికి మండల స్థాయిలో మొబైల్ కోర్టులు నడిచేలా తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. రెవెన్యూ విభాగంలో అమలు చేస్తున్న విప్లవాత్మక సంస్కరణలు, సమగ్ర భూసర్వేతో భూ రికార్డుల ప్రక్షాళన, భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో తీసు కున్న నిర్ణయాలు, వాటి కారణంగా ప్రజలకు జరుగుతున్న ప్రయోజనాలపై సమాచారాన్ని ప్రజల్లోకి పంపాలని సీఎం ఆదేశించారు. జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్షపై గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేస్తున్న నిర్ణయాలపై ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తోందని, వీటిని అధికారులు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. చాలా రాష్ట్రాల్లో మండలాలు, తాలూకాల్లో ఒకరిద్దరు సర్వేయర్లు మాత్రమే ఉంటే మన రాష్ట్రంలో ప్రతి గ్రామ సచివాలయంలోనూ సర్వేయరు ఉన్నారు. భూ యజమానుల హక్కుల పరిరక్షణ, రికార్డుల్లో స్వచ్ఛత, కచ్చితత్వానికి ఈ వ్యవస్థ చాలా ఉపయోగపడుతోంది. రిజిస్ట్రేషన్ వ్యవస్థను నేరుగా గ్రామ సచివాలయాలకు తీసుకు వస్తున్నాం. ఇప్పటికే కొన్ని గ్రామ సచివాలయాల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. ఇంటిలో నుంచే రిజిస్ట్రేషన్ చేయించుకునేలా సాంకేతికతను తీసుకువస్తున్నాం. ఇన్ని సౌలభ్యాలు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినప్పుడు వాటి గురించి మన ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు, వాటివల్ల ప్రజలకు కలిగిన ప్రయోజనాలను సమగ్రంగా వివరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జగన్ తెలిపారు. మొదటి దశలో భాగంగా ఇప్పటివరకు 2 వేల గ్రామాల్లో అన్నిరకాలుగా సర్వే పూర్తయిందని, మ్యుటేషన్లు, కొత్త సర్వే సబ్‌డివి జన్లు, 19 వేల సరిహద్దు సమస్యల పరిష్కారం, సర్వే రాళ్ల పాతడం సహా 7.8 లక్షల మందికి భూ హక్కు పత్రాలు పంపిణీ పూర్తయిందని అధికారులు సీఎంకు వివరించారు. రెండోదశలో భాగంగా మరో 2వేల గ్రామాల్లో భూహక్కుపత్రాలు పంపిణీకి సన్నాహాలు చేస్తున్నామని, అక్టోబరు 15 నాటికి రెండో దఫా సర్వే చేపడుతున్న గ్రామాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం, భూ పరిపాలనాశాఖ ప్రధాన కమిషనర్ జి.సాయి ప్రసాద్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, గనులు, భూగర్భశాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ సూర్యకుమారి, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, గ్రామ వార్డు సచివాలయాలశాఖ డైరెక్టర్ లక్ష్మీషా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైల్వేబోర్డుకు మొదటి మహిళా చైర్‌పర్సన్‌గా సిన్హా

న్యూఢిల్లీ: రైల్వేబోర్డు సీఈఓ, చైర్‌పర్సన్‌గా జయావర్మ సిన్హాను మోదీ సర్కారు గురువారం నియమించింది. రైల్వేబోర్డుకు మొదటి మహిళా చైర్‌పర్సన్‌గా సిన్హా రికార్డు సృష్టించారు. ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీసెస్(ఐఆర్ఎంఎస్) సభ్యురాలిగా పనిచేస్తున్న జయవర్మ సిన్హాను రైల్వేబోర్డు చైర్‌పర్సన్, సీఈఓగా నియమించడాన్ని కేబినెట్ నియామక కమిటీ(ఏసీసీ) ఆమోదించింది. సెప్టెంబరు 1వ తేదీ తర్వాత ఆమె బాధ్యతలు చేపడతారు. 2024 ఆగస్టు 31 వరకు ఆమె ఆ పదవిలో కొనసాగుతారు. అనిల్‌కుమార్ లహోటీ స్థానంలో సిన్హా బాధ్యతలు చేపడతారు. అలహాబాద్ యూనివర్సిటీ విద్యార్థి అయిన సిన్హా.. 1988లో ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసులో చేరారు. నార్తరన్ రైల్వే, సౌత్‌ఈస్ట్ రైల్వే, ఈస్టరన్ రైల్వేలో ఆమె పనిచేశారు. బంగ్లాదేశ్‌లోని ఢాకాలో భారత హైకమిషన్‌లో రైల్వే సలహాదారుగా నాలుగేళ్లు పనిచేశారు. ఆ సమయంలోనే కోల్‌కతా-ఢాకా మైత్రీ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ఈస్టరన్ రైల్వే, సీల్దా డివిజన్ రైల్వే మేనేజరుగా బాధ్యతలు నిర్వహించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.